# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
అనునిత్యం ప్రజల పక్షం
TELTEL12273
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : పొల్లెపాక రాజేష్



విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలవడుతున్న
తెలంగాణ ముచ్చట్లు దిన పత్రికలో
పనిచేయుటకు జిల్లా బ్యూరో , స్టాఫ్ రిపోర్టర్లు,
నియోజకవర్గ ఆర్.సి.లు, మండల స్థాయి రిపోర్టర్లుగా
పనిచేయుటకు ఆసక్తి, ఉత్సాహం కలిగిన
యువతి యువకులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.
9493669669, 9391230209



వరంగల్ సంపుటి : 2 సంచిక : 204 బుధవారం 4 - 09 - 2024 పేజీలు : 08 వెల : 5


### 'అపరాజిత' బిల్లుకు

## బెంగాల్ అసెంబ్లీ

# ఏకగ్రీవ ఆమోదం



**కోల్‌కతా, తెలంగాణ ముచ్చట్లు :** పశ్చిమబెంగాల్‌లో ట్రయినీ వైద్యురాలి హత్యాచార ఘటన ప్రకంపనలు సృష్టించిన నేపథ్యంలో అత్యాచారం, హత్య కేసుల్లో దోషులకు మరణదండన విధించేందుకు ఉద్దేశించిన 'అపరాజిత ఉమన్ అండ్ చైల్డ్ బిల్లు (వెస్ట్ బెంగాల్ క్రిమినల్ లాస్ అండ్ ఎమెండమెంట్)-2024ను బెంగాల్ ప్రభుత్వం అసెంబ్లీలో మంగళవారం ప్రవేశపెట్టింది. చర్చ అనంతరం దీనికి సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఇది 'చరిత్రాత్మిక బిల్లు' అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అసెంబ్లీలో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. అత్యాచారం, లైంగిక నేరాలపై కొత్త ప్రొవిజన్స్‌తో రూపొందించిన ఈ బిల్లు మహిళలు, పిల్లలకు మరింత రక్షణ కల్పిస్తుందని అన్నారు. బిల్లుపై చర్యలో మమతా బెనర్జీ మాట్లాడుతూ, అత్యాచారాలు మానవత్వానికి మాయని మచ్చ అని, అలాంటి నేరాలకు అట్టుకట్ట వేసేందుకు సామాజిక సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని

2 లో

### తక్షణ సాయంగా

# 2వేల కోట్లు ఇవ్వండి



- వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించండి
- కేంద్రాన్ని మరోమారు కోరిన సిఎం రేవంత్
- మహబూబాబాద్ వరద ప్రాంతాల్లో పర్యటన
- వరదనష్టంపై అధికారులతో సమీక్ష
- జిల్లాల్లోనూ ఆక్రమణల తొలగింపునకు హైడ్రా

**మహబూబాబాద్, సెప్టెంబర్3తెలంగాణ ముచ్చట్లు :** కేంద్రం వరదలను జాతీయ విపత్తుగా గుర్తించి 2వేల కోట్లను తక్షణ సాయంగా అందించాలని సిఎం రేవంత్ రెడ్డి కోరారు. వరదనష్టం భారీగా ఉందని, 5300 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారని అన్నారు. దీనిపై ఇప్పటికే కేంద్రానికి లేఖ రాశానని, జాతీయ విపత్తుగా గుర్తించాలని కోరానని అన్నారు. మహబూబాబాద్ జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. జిల్లాలో పర్యటించిన ఆయన.. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కతో కలిసి వరదలపై సమీక్ష నిర్వహించారు. మంగళవారం నాడు మహబూబాబాద్ జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలన చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... అనంతరం మహబూబాబాద్ జిల్లాలో వాటిల్లిన నష్టాలపై కలెక్టరేట్ లో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో నలుగురు మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. దాదాపు 30వేల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని వెల్లడించారు. సహాయచర్యల్లో నిరంతరం పనిచేసిన రెవెన్యూ, పోలీసు సిబ్బందిని అభినందించారు. అధికారుల చర్యలతో ప్రాణనష్టం

2 లో

### ప్రభుత్వ వైఫల్యం వల్లే

# వరదల్లో భారీ నష్టం



- ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం
- మృతుల కుటుంబాలకు 25లక్షల పరిహారం ఇవ్వాలి
- ఖమ్మంలో పర్యటించిన ఎమ్మెల్యే హరీష్ రావు

**ఖమ్మం, సెప్టెంబర్3తెలంగాణ ముచ్చట్లు :** ఖమ్మం నగరంలో పర్యటించిన మాజీ మంత్రి హరీష్ రావు.. రాష్ట్ర ప్రభుత్వం తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వ వైఫల్యం వల్లే వరదల కారణంగా భారీ నష్టం సంభవించిందన్నారు. ఖమ్మం బీఆర్ఎస్ పార్టీ ఆఫీసులో మీడియాతో మాట్లాడిన ఆయన.. మూడు నాలుగు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా జనజీవనం స్తంభించిపోయిందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం, వైఫల్యం కారణంగానే భారీ నష్టం వాటిల్లిందని విమర్శించారు. వరద బాధితులకు సహాయం చేసేందుకే తాము ఇక్కడికి వచ్చామన్నారు. తొమ్మిది మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు మంత్రులు ఉండి కూడా జిల్లా ప్రజలను కాపాడలేకపోయారని హరీష్ రావు విమర్శించారు. పాలనపై పట్టుకోల్పోయిన సీఎం.. ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోకపోవడం

2 లో

### మాజీమంత్రి పువ్వాడ

# వాహనంపై రాళ్లదాడి

- ఒకరికి గాయాలు..ఘటనపై మండిపడ్డ కెటిఆర్



**ఖమ్మం, సెప్టెంబర్3తెలంగాణ ముచ్చట్లు :** తెలంగాణలో నాలుగు రోజులుగా భారీ వర్షాలు పడుతున్నాయి. ఏకధాటిగా కురుస్తున్న వానలతో ఖమ్మం జిల్లాలోని మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో పలు కాలనీలు జలమయం అయ్యాయి. కాలనీల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బాధితులను ప్రభుత్వం అండగా నిలిచి సహాయ కార్యక్రమాలు చేపట్టింది. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు ఖమ్మం జిల్లాలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. అయితే ఈ పర్యటనలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వాహనంపై కొంతమంది వ్యక్తులు రాళ్ల దాడి చేశారు. ఈ దాడిలో బీఆర్ఎస్ నేతలకు గాయాలు అయ్యాయి. ఒకరికి కాలు విరగడంతో ఆస్పత్రికి తరలించారు. దాడి జరిగిన మంచి కంటి నగర్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ఖమ్మంలో బీఆర్ఎస్ నేతలపై దాడిని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ మాజీ మంత్రులు హరీష్‌రావు, పువ్వాడ అజయ్ కుమార్, సబితా

2 లో

## ఆర్టీసీబస్సు, లారీ ఢీ

- ముగ్గురు దుర్మరణం

**జనగామ,తెలంగాణముచ్చట్లు :** జనగామ జిల్లా పాలకుర్తి మండలం వావిలాల గ్రామ శివారులోని మూలమలుపు వద్ద మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. లారీ, బస్సు ఢీకొన్న ఈ ప్రమాదంలో.. ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులను మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం టిక్యా తండాకు చెందిన హేమాని (65), అతని భార్య బుజ్జమ్మ (60) పాలకుర్తి మండలానికి చెందిన హసీమా (58)గా గుర్తించారు. ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే యశశ్విని రెడ్డి, డీసీపీ రాజమహేంద్ర నాయక్ పరిశీలించారు.

## ఎన్‌కౌంటర్‌లో 9 మంది

## మావోయిస్టులు మృతి

**ఛత్తీస్‌గఢ్, సెప్టెంబర్ 03:** ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో తొమ్మిది మంది మావోయిస్టులు మృతి చెందారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో మావోయిస్టుల మృత దేహాలతోపాటు పలు ఆయుధాలను సైతం స్వాధీనం చేసుకున్నామని పోలీస్ ఉన్నతాధికారి వెల్లడించారు. వాటిలో 303 సెల్ఫ్ లోడింగ్ రైఫిల్స్‌తోపాటు 12 తుపాకులున్నాయని వివరించారు. బీజాపూర్, దంతేవాడ జిల్లాల సరిహద్దుల్లో భారీగా మావోయిస్టులు ఉన్నారంటూ మంగళవారం సమాచారం అందిందని తెలిపారు.

### ఎస్డీఆర్ఎఫ్ నిధులతో

# బాధితులను ఆదుకోవాలి

- రాష్ట్రానికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సూచన



**హైదరాబాద్, సెప్టెంబర్3తెలంగాణ ముచ్చట్లు :** రాష్ట్రప్రభుత్వం వద్ద ఉన్న ఎస్డీఆర్ఎఫ్ నిధులతో బాధితులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కోరారు. యుటిలైజేషన్ నిధులపై బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇప్పటివరకు ఎలాంటి రిపోర్ట్ విడుదల చేయలేదని చెప్పారు. ఎస్డీఆర్ఎఫ్ కింద రాష్ట్ర ప్రభుత్వం వద్ద రూ. 1300 కోట్లకు పైగా నిధులు ఉన్నాయని తెలిపారు. మరో రూ. 200 కోట్లు యూసీ నిధులున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయి నివేదిక సమర్పిస్తే కేంద్ర ప్రభుత్వం దానికి తగిన నిధులు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందని కిషన్‌రెడ్డి తేల్చిచెప్పారు. వరదల్లో చనిపోయిన వారికి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 3లక్షలు వస్తాయని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

2 లో

### సిఎం రిలీఫ్ ఫండ్‌కు

# 3వేలు అందించిన విద్యార్థి

**మహబూబాబాద్, తెలంగాణ ముచ్చట్లు :** రాష్ట్రంలో వరద సహాయక చర్యలకు తమ ఒక రోజు మూల వేతనం రూ. 130 కోట్లను తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెక్ రూపంలో అందజేసారు. ఈ మేరకు వారు సిఎంను కలసి తమవంతు సాయం అందించారు. ఉదయం సమావేశమై ఉద్యోగుల జెఏసి నిర్ణయం తీసుకుంది. ఇదిలా వుంటే వరద సహాయక కార్యక్రమాలకు తన కిట్టీ బ్యాంకు నుంచి రూ. 3వేలను



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మహబూబాబాద్ జిల్లాకు చెందిన పదో తరగతి విద్యార్థిని ముత్యాల సాయి సింధు అందజేసింది. తెలుగు రాష్ట్రాల్లో వరదలు ముంచెత్తుతున్నాయి. ఈ క్రమంలో మహబూబాబాద్ లో ఓ చిన్నారి సీఎం రేవంత్‌కు తన కిడ్డీ బ్యాంకు నుంచి రూ. 3 వేలను వరద సహాయనిధిని

2 లో

# సంపాదకీయం

## ఐపీవోలో అలాట్ అయితే చాలు.. మెజార్టీ అలానే చేస్తున్నారట

కరోనా పుణ్యమా అని స్టాక్ మార్కెట్ మీద అభిరుచి.. ఆసక్తి ఎక్కువ అయ్యాయి. ఇందులో పెట్టుబడి పెట్టే వారి సంఖ్య అంతకంతకూ ఎక్కువ అవుతోంది. దీంతో.. భారీ ఎత్తున లావాదేవీలకు కారణమవుతోంది. ఇదిలా ఉంటే.. పబ్లిక్ ఆఫర్ ద్వారా కంపెనీలు కేటాయించే షేర్ల కోసం పెట్టుబడులు పెట్టే వారి సంఖ్య గతం కంటే ఎక్కువైంది. ఇదిలా ఉంటే.. ఈ ఐపీవోలకు సంబంధించిన ఒక అధ్యయనం బయటకు వచ్చింది. ఇందులో ఆసక్తికర అంశాల్ని ప్రస్తావించారు. ఐపీవో ద్వారా కంపెనీలు కేటాయించిన షేర్లలో అత్యధికులు.. కంపెనీలు తమకు షేర్లను అలాట్ చేసిన వారం వ్యవధిలోనే అమ్మేస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉందన్న విషయాన్ని గుర్తించారు. అంతేకాదు. .2021 ఏప్రిల్ నుంచి 2023 డిసెంబరు మధ్య ఐపీవో కోసం అప్లై చేసుకున్న డి మ్యాట్ ఖాతాల్లో సగం వరకు కొవిడ్ సమయంలోనే ప్రారంభం చేసినవి కావటం గమనార్హం. ఇక.. దాదాపు 54 శాతం షేర్లను స్టాక్ ఎక్స్చేంజ్ లో నమోదైన వారంలోనే మదుపర్లు అమ్మేస్తున్న విషయాన్ని సెబీ గుర్తించింది. దీనికి యాంకర్ ఇన్వెస్టర్ల్ల మినహాయింపుగా చెప్పాలి. ఐపీవోల్లో పెట్టుబడులు పెడుతున్న మదపర్లు లాభాల మీదనే ఎక్కువగా ఫోకస్ పెడుతున్నారు. వారం లోపు ఐపీవో లో అలాట్ అయిన షేర్లపై 20 శాతానికి మించిన లాభాన్ని పొందినట్లుగా గుర్తించారు. అదే సమయంలో షేరు జారీ ధర కంటే ట్రేడింగ్ లో విలువ తక్కువగా ఉన్నప్పుడు మాత్రం 23.3 శాతం షేర్లను మాత్రమే అమ్ముకోవటం కనిపిస్తోందన్న విషయాన్ని తాజా అధ్యయనం వెల్లడించింది. 2021 ఏప్రిల్ నుంచి 2023 డిసెంబరు మధ్య జరిగిన 144 పబ్లిక్ ఇష్యూలు మొత్తం రూ.2.13 లక్షల కోట్ల నిధులను సమీకరించగా.. మొత్తం ఇష్యూ పరిమాణంలో 65 శాతం వరకు షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా అమ్మేయటాన్ని గుర్తించారు. మదుపరులు తమకు అలాట్ అయిన షేర్ల విలువలో 50.2 శాతాన్ని నమోదైన వారంలోనే అమ్మేస్తున్నారు. అదే ఎన్ఐఐలు 63.3 శాతం.. చిన్న మదుపరులు 42.7 శాతం షేర్లు అలాట్ అయిన వారంలోపే అమ్మేస్తున్నారు. ఐపీవోల కేటాయింపులు ప్రాంతాల వారీగా చూస్తే.. గుజరాత్ లో 39.3 శాతం, మహారాష్ట్రలో 13.5 శాతం.. రాజస్థాన్ 10.5 శాతం కేటాయింపులు జరిగినట్లుగా గుర్తించారు. మ్యూచువల్ ఫండ్ లు తమకు కేటాయించిన షేర్లలో 3.3 శాతం షేర్లను వారంలో అమ్మేస్తుంటే.. బ్యాంకులు 79.8 శాతం షేర్లను అమ్మేస్తున్నట్లుగా గుర్తించారు.

## వరద బాధితులకు చాపలు , బ్లాంకెట్స్ పంపిణీ చేసిన జమాఅతె ఇస్లామి హింద్



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వరదలు వచ్చి సర్వం కోల్పోయి నిరాశరులైన దంసలాపురం కాలనీ వరద బాధితులకు జమాఅతె ఇస్లామి హింద్ ఖమ్మం శాఖ ఆధ్వర్యంలో వరద ముంపు బాధిత కుటుంబాలకు ఇండ్ల దగ్గరికి వెళ్లి చాపలు , బ్లాంకెట్స్ పంపిణీ చేయడం జరిగింది. జమాఅతె ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షులు జైనుల్ పాషా నిరాశరులైన వరద బాధితులతో కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు జమాత్ నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యాక్రమములో వన్ టౌన్, టూ టౌన్, అధ్యక్షులు అబ్దుల్ మలిక్, అబ్రార్ అలీ సభ్యులు నిజాముద్దీన్, గౌస్, యసుఫ్ షరీఫ్, ఇంద్ర నగర్ మహిళా అధ్యక్షురాలు హుస్సేన్ బి, జహీరా, ఆరిఫా ఎంపీజే జిల్లా అధ్యక్షులు షేక్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

# అప్రమత్తం గావిస్తున్న ఆనం

**నెల్లూరు,తెలంగాణ ముచ్చట్లు :** విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో గత రెండు రోజులుగా ముమ్మరంగా పర్యటిస్తున్న రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి. విజయవాడలోని వరద ముంపు బాధితుల కోసం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను సందర్శించి బాధితులను పరామర్శిస్తూ మెరుగైన వసతులను యంత్రాంగాన్ని అప్రమత్తం గావిస్తున్న మంత్రి ఆనం. అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ యుద్ధప్రాతిపదికన పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఆహారం, తాగునీరు మొదలైన కనీస అవసరాలను సమకూరుస్తున్న మంత్రి. వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులతో మాట్లాడి చేపట్టాల్సిన తక్షణ చర్యలపై అధికారులకు ఆదేశాలిస్తున్న మంత్రి... ప్రతి ఒక్కరికి నిత్యావసర సరుకులను దగ్గరుండి అందజేసిన మంత్రి. బాధితులందరికి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు అండగా ఉంటూ నిరంతరం అధికారులతో సహాయక కార్యక్రమాలపై సమీక్షిస్తున్నారని... ఎవరు అధైర్య పడద్దని బాధితులను తప్పక ఆదుకుంటామని భరోసా కల్పిస్తున్న మంత్రి.

## తక్షణ సాయంగా 2వేల కోట్లు ఇవ్వండి

తగ్గించగలిగాం. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున పరిహారం ప్రకటించాం. పంట నష్టం అంచనా వేసి పరిహారం అందజేస్తాం. నష్టపోయిన మూడు తండాలవాసులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం. నష్టంపై కేంద్రానికి నివేదించడానికి నివేదిక తయారు చేయాలి. కేంద్రం దీన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలి. ఆస్తి, ప్రాణ నష్ట పరిశీలనకు ప్రధాని మోదీని ఆహ్వానించాం. తక్షణమే రాష్ట్రానికి రూ.2వేల కోట్లు కేటాయించాలని కోరారు. వర్షం తగ్గినందున బురద తొలగించే పనులు అధికారులు ప్రారంభించాలి. ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తే ఇళ్లలోని బురద తొలగించవచ్చు. విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉంది.. మరింత జాగ్రత్తగా ఉండాలి. ఎంత ఒత్తిడి ఉన్నా హైడ్రా ఏర్పాటు చేసి ఆక్రమణలను కూల్చేస్తున్నాం అన్నారు. ప్రకృతి ప్రకోపిస్తే ఏం జరుగుతుందో మనం ఇతర రాష్ట్రాల్లో చూస్తున్నాం. చెరువులు, నాలాల ఆక్రమణల తొలగింపునకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుంది. ఆక్రమణలకు సహకరించిన వారిపై కూడా చర్యలు ఉంటాయి. పేదల ప్రాణాలు పోయాక ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తూ కూర్చోదు. పువ్వాడ ఆక్రమణలు తొలగించాలని హరీశ్‌రావు డిమాండ్ చేయగలరా? ఆక్రమణల తొలగింపునకు హరీశ్‌రావు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తారా? చెరువులను ఆక్రమించిన వారు ఎంతటివారైనా తొలగించాల్సిందే. ఆక్రమణల తొలగింపునకు విధివిధానాలు రూపొందించాలని సీఎం రేవంత్ అధికారులకు దిశానిర్దేశర చేశారు. హైడ్రా తరహాలో ప్రతి జిల్లాలోనూ ఒక వ్యవస్థను కలెక్టర్లు ఏర్పాటు చేసుకోవాలని నిర్దేశించారు. చెరువులను ఆక్రమించుకోవడం క్షమించరాని నేరం అని.. చెరువుల ఆక్రమణలపైన రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపడతామని రేవంత్ రెడ్డి చెప్పారు. ఆక్రమణలకు పాల్పడినది ఎంతటి వారైనా వదిలి పెట్టబోమని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. చెరువుల ఆక్రమణకు సహకరించిన అధికారులపైన చర్యలు తీసుకోవాలని అన్నారు. చెరువులు, నాలాల ఆక్రమణల జాబితా సిద్దం చేయాలి. మాజీ మంత్రి ఆక్రమణ వల్లనే ఖమ్మంలో వరదలు వచ్చాయనే ఫిర్యాదులు వచ్చాయి. అమెరికాలో జల్సాలో మునిగి తేలుతున్న ఆయన.. ప్రభుత్వం పైన విమర్శలు చేస్తున్నడు. వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు వెళ్లినట్లుగా హరీష్ రావు ఖమ్మం పర్యటనకు పోయిండు. ఖమ్మం మాజీ మంత్రి ఆక్రమణలపైన తొలగింపునకు హరీష్ రావు సహకరిస్తారా?అని ప్రశ్నించారు.680 మందికి పునరావాసం కల్పించాం. సీతారామ తండాలో వరద సమయంలో ప్రజలకు అండగా నిలబడ్డ ఎస్సై నగేష్ కి అభినందనలు. చనిపోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తాం. ఆకేరు వాగు వరద బారిన పడుతున్న 3 తండాలను ఒకే ప్రాంతానికి తరలించి అదర్శ కాలనీ నిర్మించాలని కలెక్టర్ కు ఆదేశించాం. పంట నష్టం జరిగిన ప్రతి ఎకరానికి రూ.10 వేల సాయం అందిస్తాం. తెలంగాణలో వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని ప్రధానికి లేఖ రాశాం. జరిగిన నష్టాన్ని పరిశీలించడానికి రాష్ట్రానికి రావాలని ప్రధాన మంత్రిని కోరుతున్నాం. దోమల నివారణ చర్యలు తీసుకోవాలి. నష్టం జరిగిన ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం ఇతర ప్రాంతాల నుంచి అధికారులను రప్పించుకోవాలి. కూలిపోయిన విద్యుత్ లైన్లను తక్షణమే పునరుద్దరించాలి. వరద ప్రమాద ప్రాంతాలు, ప్రమాదానికి కారణాలు, వాటిని ఎదుర్కొన్న తీరుపై బ్లూబుక్ ను తయారు చేసుకోవాలి. వాటిని కలెక్టరేట్లలో ఉంచాలని అన్నారు.రదలు వచ్చినప్పుడు కేసీఆర్ పదేళ్లలో ఎప్పుడైనా పరామర్శకు వచ్చారా..? మాసాయిపేటలో పసిపిల్లలు చనిపోతే కేసీఆర్ పరామర్శించలేదు. హైదరాబాద్ శివారులో పశు వైద్యురాలిని హత్యచేస్తే వెళ్లి చూడలేదు. మానవత్వం లేని మనిషి కేసీఆర్. ప్రతిపక్ష నేత ఎక్కడున్నాడు? ఎందుకు మాట్లాడటం లేదు? స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు వరద బాధితులకు సాయం కోసం ముందుకు రావాలని రేవంత్ రెడ్డి పిలుపు ఇచ్చారు.

## ప్రభుత్వ వైఫల్యం వల్లే వరదల్లో భారీ నష్టం

వల్లే ఈ నష్టం జరిగిందన్నారు. కట్టు బట్టలు తప్ప తమవద్ద ఏమీ లెవని వరద బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని హరీష్ రావు తెలిపారు. వరదల కారణంగా మరణించిన వారి కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోల్పోయిన వస్తువులకు రూ. 2 లక్షల ఆర్థిక పరిహారం ఇవ్వాలన్నారు. ఎంతో మంది విద్యార్థుల సర్టిఫికెట్లు వరదలో కొట్టుకుపోయాయని.. వారి సర్టిఫికెట్లను వారికి ఇప్పించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. వరద బాధితులకు కనీసం మంచినీళ్లు, అన్నం కూడా అందించలేకపోయారని ప్రభుత్వం తీరుపై హరీష్ రావు ధ్వజమెత్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయ లోపం కారణంగా ఈ ఘోరం జరిగిందని హరీష్ రావు

విమర్శించారు. వరదల కారణంగా 28 మంది చనిపోతే.. ప్రభుత్వం మాత్రం 16 మందిని మాత్రమే చూపిస్తోందని ఆరోపించారు. భక్త రామదాసు, పాలమూరు ప్రాజెక్టులు మునిగిపోయాయని.. దీనంతటికీ కారణంగా రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే అని తూర్పారబట్టారు. ప్రభుత్వ నిర్లక్ష్యం ధోరణి కారణంగా వేల ఎకరాల్లో పంట నీట మునిగిందన్నారు. పొంగలేటి శ్రీనివాస్ రెడ్డి గతంలో పంట నష్టానికి రూ. 30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారని.. ఇప్పుడు పంట నష్టానికి ఎకరాకు రూ. 30 వేలు ఇవ్వాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. అలాగే పొలాలు బాగు చేసుకోవడానికి రూ. 50 వేలు ఇవ్వాలన్నారు. అధికారంలో ఉండి.. ప్రతిపక్షం సహాయం చేయాలని అడుగున్నారని ప్రభుత్వం పెద్దల తీరుపై హరీష్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి చేతకానితనాన్ని, వారికి అంటిన బురదను ప్రతిపక్షంపై చల్లే కుట్ర చేస్తోన్నారని ఆరోపించారు. వరదలపై రాజకీయం చేస్తు?న్న ముఖ్యమంత్రిని తొలిసారి చూస్తున్నామన్నారు. ప్రభుత్వం తరపున ఖమ్మం వచ్చిన ఆరుగురు ప్రముఖులు ఉపన్యాసాలు చెప్పారు తప్ప.. ప్రణాళిక గురించి మాట్లాడారా? అని హరీష్ రావు ప్రశ్నించారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఫెయిల్ అయ్యారని.. అందుకే ముఖ్యమంత్రి వచ్చారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఓ అమ్మాయ మీద దాడి చేసేందుకు కాంగ్రెస్ యత్నిస్తోందని విమర్శించారు. ఆ అమ్మాయిని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేగా ప్రజల కష్టాల తెలుసుకోవడాని వస్తే తమపైనా దాడి చేశారని కాంగ్రెస్ శ్రేణులపై హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులు చేయడమే కాంగ్రెస్ ప్రజా పాలనా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడమే తమ బాధ్యత అని ఉద్ఘాటించారు. వరద బాధితులకు ఇంటికి రూ. 2 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ పాలన బాగుందని ప్రజలే అంటున్నారని పేర్కొన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. కాగా, ఖమ్మం వరదల్లో చిక్కుకున్న బాధితులను కాపాడిన వారిని అభినందిస్తున్నట్లు హరీష్ రావు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున రాష్ట్ర వ్యాప్తంగా వరద బాధితులకు సహాయం అందిస్తామన్నారు. బుధవారం నాడు సిద్ధిపేట నుంచి 4 లారీలలో ఆహార పదార్థాలతో తమ నాయకులు బయలుదేరుతారని.. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ నాయకులు సాయం అందించబోతున్నారని హరీష్ రావు తెలిపారు. కాంగ్రెస్ నేతల తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటికైనా తేరుకుని.. బాధితులను కాపాడాలని ప్రభుత్వానికి హరీష్ రావు సూచించారు.

## 'అపరాజిత' బిల్లుకు బెంగాల్ అసెంబ్లీ ఏకగ్రీవ ఆమోదం

మమతా బెనర్జీ అన్నారు. అపరాజిత బిల్లుపై సంతకం చేయాలని విపక్షాలు గవర్నర్ సీవీ ఆనంద బోస్‌ను కోరాలని సూచించారు. అనంతరం చట్టంగా తీసుకు వచ్చే బాధ్యత మనపై ఉందన్నారు. సీబీఐ నుంచి న్యాయం కోరుతున్నామని, దోషులకు మరణశిక్ష విధించాలని తాము కోరుతున్నామని చెప్పారు. 'అపరాజిత' బిల్లుతో సత్వర విచారణ, బాధితులకు న్యాయ లభిస్తుందన్నారు. బిల్లు పాస్ కాగానే ప్రత్యేక అపరాజిత టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. కోల్‌కతా ట్రయినీ డాక్టర్ మృతికి నివాళి అర్పించారు. కాగా, బిల్లుకు ప్రధాన విపక్షమైన బీజేపీ మద్దతు ప్రకటించింది. లా కమిటీ వద్దకు బిల్లు వెళ్లిందో లేదో తమకు తెలియని, అయితే బిల్లు తక్షణం అమలు కావాలని తాము కోరుతున్నామని, తక్షణ ఫలితాలు ఆశిస్తున్నామని, బిల్లుకు తమ మద్దతు ఉంటుందని అంతకుముందు మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీలో విపక్ష నేత సువేందు అధికారి చెప్పారు.

## ఎస్డీఆర్ఎఫ్ నిధులతో బాధితులను ఆదుకోవాలి

ప్రకటించిన రూ. 5లక్షల్లో కేంద్రం ఇచ్చే రూ. 3లక్షలు కలుపుకొని ఇస్తారా? లేదా? రాష్ట్ర ప్రభుత్వమే రూ. 5లక్షలు ఇస్తోందా? అనే విషయంపై క్లారిటీ లేదని కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ... ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి.. వారం రోజుల కంటే ఎక్కువ రోజులు ఉంటే రూ. 16వేలు, వారం లోపుల ఆస్పత్రిలో ఉంటే రూ. 4 వేలను ఆస్పత్రి ఖర్చులకు కేంద్రం ఇస్తుందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

అంటు వ్యాధులు సోకకుండా మెడిసిన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17ఉత్సవాలపై రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శలు చేశారు. దీంతో కేంద్ర ప్రభుత్వమే నిర్వహించాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. 1948లో నిజాం లొంగిపోయిన రోజు... గణెళిష్ నిమజ్జనం ఒకేరోజు జరిగిందని చెప్పారు. మళ్లీ 75ఏళ్ల తర్వాత ఇది రిపేట్ అవ్వడం సంతోషమని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

## సిఎం రిలీఫ్ ఫండ్‌కు 3వేలు అందించిన విద్యార్థి

అందించింది. తెలంగాణలో భారీ వర్షాలు జనజీవనాన్ని కకావికలం చేస్తున్నాయి. సర్వం కోల్పోయి గుక్కెడు మంచి నీళ్లు, ఆహారం కోసం దీనంగా ఎదురుచూస్తున్న లక్షలాది మంది నిరాశ్రయులకు సహాయం అందించేందుకు అనేక మంది సినీ, రాజకీయ ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వస్తున్నాయి. పదో తరగతి చదువుచున్న ముత్యాల సాయి సింధు సీఎం రిలీఫ్‌ఫండ్‌కు రూ. 3 వేల రూపాయిలు అందించింది. తెలంగాణ రాష్ట్రంలో భారీ వర్షాలు వరదల కారణంగా తీవ్ర ప్రాణ నష్టం, ఆస్తినష్టం సంభవించింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 21 మంది ప్రాణాలు పోయాయి. భారీగా ఆస్తి నష్టం, పంట నష్టం సంభవించింది. వరదల కారణంగా అనేక గ్రామాలలో పరిస్థితి దారుణంగా ఉన్నాయి. అనేక గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకోవడంతో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు.

## మాజీమంత్రి పువ్వాడ వాహనంపై రాళ్లదాడి

ఇంద్రారెడ్డి వాహనాలపై దాడి చేయటం కాంగ్రెస్ అసహనానికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రజలకు సాయం చేయటం చేతగాక.. సాయం చేస్తున్న నేతలను చూసి ఓర్వలేకే ఈ దాడికి తెగబడ్డారని విమర్శలు చేశారు. ప్రభుత్వం ప్రజలను నిర్లక్ష్యం చేస్తే వారికి తాము అండగా ఉండటమే తప్పా? అని ప్రశ్నించారు. ప్రజలకు సేవ చేయటం చేతకాదు...సేవ చేసే వాళ్లపై మాత్రం దాడి చేయటం? సిగ్గు చేటు అని అన్నారు. ఈ దాడికి ముఖ్యమంత్రితో సహా కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు ఎన్ని చేసినా సరే...ప్రజల వద్దకు బీఆర్ఎస్ శ్రేణులను వెళ్లకుండా ఆపలేరని హెచ్చరించారు. కాంగ్రెస్ చేతగాని, దద్దమ్మ పాలనను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఈ ప్రభుత్వానికి సరైన సమయంలో బుద్ధి చెప్పటం ఖాయమని కేటీఆర్ వార్నింగ్ ఇచ్చారు.




## వరద బాధితులకు సాయం అందిస్తున్న ట్రైనీ పోలీసులు

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** వరద ముంపు ప్రాంతాల ప్రజలకు అండగా సహాయ సహకారం అందిస్తున్న 525 మంది ట్రైనీ పోలీసులు ఖమ్మం రూరల్ మండలం కరుణగిరి పరిసరాలలోని రాజీవ్ గృహకల్ప, జలగం నగర్, ఖమ్మం టౌన్ పరిధిలోని బొక్కలగడ్డ, ధంసాలపూరం కాలనీ తదితర వరద ముంపు ప్రాంతాల్లో బాధితులకు అండగా 525 మంది ట్రైనీ కానిస్టేబుళ్లు సహాయ కార్యక్రమాల్లో పాల్గొని బాధితుల సాదారణ జన జీవనానికి సహాయ సహకారం అందిస్తున్న ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్..

## వర్షానికి కూలిపోయిన చేనేత కార్మికుని ఇల్లు

- ఆదుకోవాలని చేనేత కార్మికుని వేడుకోలు



**తెలంగాణ ముచ్చట్లు దేవరుప్పుల :** గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చేనేత కార్మికుని ఇల్లు పూర్తిగా కూలిపోయింది.దేవరుప్పులంలోని కడవెండి గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు నల్ల అశోక్ ఇల్లు వర్షానికి పై కప్పు మంగళవారం కూలిపోయింది.బట్ట నేస్తనె పొట్ట నిండే ఓ చేనేత కార్మికుడు నల్ల అశోక్ తన ఇల్లు కూలిపోవడంతో దీనస్థితిలో ఉన్నాడు.ఇలానే వర్షం పడితే ఇల్లు పూర్తిగా నేలమట్టం ఆయితే నా పరిస్థితి ఏంటి అని దుక్కంలొ ఉన్న చేనేత కార్మికుడు తనను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

## పోలీస్ కమిషనర్ ను కలిసి ఫిర్యాదు చేసిన మాజీ మంత్రి పువ్వాడ



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** బీఆర్ఎస్ ప్రముఖులపై దాడికి పాల్పడిన అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవలసిందిగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బానోతు మదన్ లాల్, మాజీ జేడ్పీ మాజీ ఛైర్మన్ లింగాల కమల్ రాజ్ తదితరులు ఖమ్మం నగర పోలీస్ కమిషనర్ సునీల్ దత్ కు ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, గుంటకండ్ల జగదీష్ రెడ్డి,సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావులు మున్నేరు ముంపు బాధితులను పరామర్శిస్తున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు రాళ్లతో దాడికి దిగడంతో సంతోష్ రెడ్డి అనే బీఆర్ఎస్ నాయకుడు తీవ్రంగా గాయపడడాన్ని సీపీ సునీల్ దత్ కు పువ్వాడ అజయ్ కుమార్ వివరించారు దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరుతూ బీఆర్ఎస్ ప్రముఖులు సీపీకి వినతిపత్రం సమర్పించారు.

# గణేష్ విగ్రహ ఏర్పాటు కోసం పోలీస్ అనుమతి తప్పకుండా తీసుకోవాలి

### -గణేష్ నవరాత్రుల ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

### -పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :**గణేష్ విగ్రహ ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. గణేష్ మండపాల కోసం ముందుగా వారు ఏర్పాటు చేస్తున్న గణేష్ ప్రతిమ ఎత్తు ఏర్పాటు చేస్తున్న ప్రదేశం నిమజ్జనం తేదీ ప్రదేశం మొదలగు సమాచారం తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ ప్రోటోకాల్ వెబ్సైట్ https://policeportal.tspolice.gov.in/index.htm ద్వారా మండపాల నిర్వాహకులు పూర్తి వివరాలు నమోదు చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం స్టేషన్ పోలీస్ అధికారులు ఆన్లైన్ ద్వారా అనుమతులు జారీ చేస్తారని తెలిపారు. అదేవిధంగా గణేష్ నవరాత్రులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ మైకు పర్మిషన్ విధ్యుత్ శాఖ నుండి పర్మిషన్ తీసుకోవాలని సూచించారు. గణేష్ మండలంలో ప్రశాంతంగా గణేష్ నవరాత్రులు జరగాలని ఎటువంటి గొడవలు జరగకుండా యువత కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకొని విజ్ఞప్తి చేశారు.

**గణేష్ మండపాల నిర్వాహకులకు సూచనలు:** 1) గణేష్ విగ్రహాల ఏర్పాటుకు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. నిర్వాహకుల పేర్లు మరియు సంప్రదింపు నంబర్లు పొందుపర్చాలి. 2) విగ్రహం ఏర్పాటు స్థలం ప్రైవేట్ వ్యక్తికి చెందినదైతే, సంబంధిత వ్యక్తుల నుండి ఎటువంటి అభ్యంతర లేదని ధృవీకరణ పత్రం పొందాలి. 3) నిర్వాహకులు "విగ్రహాలను రహదారిలో కాని వివాదాస్పద స్థలాల్లో ప్రతిష్టించవద్దని విజ్ఞప్తి. 4) ప్రధాన రహదారులపై మరియు ట్రాఫిక్ రద్దీగా వుండే రహదారులపై విగ్రహాలను ఏర్పాటు చేయరాదు. 5) పోలీసులకు సమర్పించేటప్పుడు విద్యుత్ శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి మరియు దానిని వారి దరఖాస్తులకు జతచేయాలి. 6) విద్యుత్ షార్ట్ సర్క్యూట్ నివారించేందుకు.నాణ్యమైన విద్యుత్ తీగలు మరియు పరికరాలు గణేష్ పండల వద్దఉపయోగించాలి. 7) మండపాల వద్ద డి జె లకు అనుమతి ఇవ్వబడదు,రెండు మైక్ తో కూడిన స్పీకర్లు(ధ్వని పరిమాణం తప్పనిసరిగా నాన్ డిస్ట్రబెన్స్ లెవెల్లో ఉండాలి) మాత్రమే అనుమతించబడతాయి.అదేవిధంగా ఉదయం 6.00 నుండి రాత్రి 10.00 వరకు సమయాలను అనుసరించి మైక్ సౌండ్ సిస్టమ్ వినియోగించాలి. 8) గణేష్ మండపాల వద్ద అసభ్యకరమైన నృత్యాలు, కార్యక్రమాలు చేపట్టకూడదు. 9) ప్రతి గణేష్ మండపంలో ఇద్దరు సభ్యులు 24 గంటలు ఉండేలా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలి. 10) ప్రతి గణేష్ మండపం వద్దనోటీసు బోర్డును,పాయింట్ బుక్ ఏర్పాటు చేసి తప్పనిసరిగా నిర్వాహకుల సంప్రదింపు నంబర్లు మరియు వివరాలను పొందుపర్చాలి. 11) అగ్ని ప్రమాదాలను నివారించడానికి ప్రతి మండపం దగ్గర తప్పనిసరిగా ఫైర్ ప్రూఫ్గా ఉండేలా చూసుకోండి. తగినంత నీరు ఇసుక అందుబాటులో వుండాలి. 12) సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దు. అలాంటి ప్రచారాలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి. 13) సోషల్ మీడియాలో అసభ్యకరమైన మరియు మతపరమైన సందేశాల రూపంలో పుకార్లు వ్యాప్తి చేసే వ్యక్తులపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.

## పెద్దమందడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** పెద్దమందడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న సేవలం గురించి, మరియు గర్భిణీ స్త్రీలకు అందజేస్తున్న సేవల గురించి తనిఖీ చేశారు. అలాగే పాముకాటు, కుక్క కాటుకు మందులు అందుబాటులో ఉంచుకోవాలనిఆదేశించారు. ఫీవర్ కేసుల గురించి, ఇతర రోగాల గురించి వైద్యాధికారి డాక్టర్ మంజుల మేడం గారిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి జయచంద్ర మోహన్, మండల వైద్యాధికారి మంజుల, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వాహన డీలర్లతో ఆర్టీఓ సమావేశం...



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు** :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాహన డీలర్లు, సంస్థలతో ఆర్టీఓ సదానందం మంగళవారం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన డీలర్లు తాత్కాలిక రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ను జిల్లాలో సబ్ డీలర్ను కలిగి ఉన్నవారు మాత్రమే పొందటానికి అర్హులని తెలిపారు. తాత్కాలిక రిజిస్ట్రేషన్ వ్యవధిలో (30 రోజులు) వాహనం శాశ్వత నమోదుకు వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. వినియోగదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు...



## వెల్టూర్ చెరువును సందర్శించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** సప్తసముద్రాలలో ఒకటైన వెల్టూర్ గోపాల సముద్రాన్ని మంగళవారం మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి సందర్శించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పెద్దమందడి మండలం వెల్టూర్ పెద్ద చెరువు నిండడంతో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ... గత ప్రభుత్వం కృషి వల్ల వెల్టూర్ చెరువును మరమ్మత్తు పనులను చేపట్టడం జరిగిందని, చెరువు కట్ట నిర్మితమై సుందరమైన నిర్మాణంతో చెరువును పునరుద్ధరించడం జరిగిందని తెలిపారు. విస్తారమైన వర్షాలకు చెరువు నిండి అలుగు పారుతున్న సందర్భంగా గోపాల సముద్రాన్ని సందర్శించి అలుగు దగ్గర గంగమ్మ తల్లికి పసుపు,కుంకుమ,పూలు సమర్పించి పూజలు నిర్వహించారు. కట్టపైన ఉన్న కట్టమశమ్మ,వేణుగోపాలస్వామి ఆలయాలలో పూజలు నిర్వహించారు.అనంతరం కట్టపై కలియతిరుగుతూ నాయకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి రఘుపతి రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు వేణు యాదవ్,మాజీ సింగిల్ విండో అధ్యక్షులు విట్ట శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఎం.పి.పి దయాకర్, మీడియా కన్వీనర్ నందిమల్ల. అశోక్, మల్లక్. సురేష్ కుమార్, గ్రామ మాజీ రైతు బంధు అధ్యక్షులు రఘువరన్ రెడ్డి , పార్టీ గ్రామ అధ్యక్షులు.కృష్ణా రెడ్డి,భాస్కర్ రెడ్డి,సంబ యాదయ్య,,ఆంజనేయులు,శ్రీధర్,మాజీ ఎం.పిటి.సి గణేష్,వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాలేరు నియోజకవర్గంలో పొంగులేటి ప్రసాద్ రెడ్డి పర్యటన

### - నాయకన్ గూడెంలో యాకుబ్ కుటుంబానికి పరామర్శ

### - బుద్ధారంలో బ్రిడ్జి, రోడ్డు మరమ్మత్తుల కోసం ఆర్ అండ్ బి ఎస్ఈకి వినతి

### - ఖమ్మం రూరల్ లోనూ బాధిత కుటుంబాలకు భరోసా



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి పాలేరు నియోజకవర్గంలో మంగళవారం పర్యటించారు. భారీ వర్షాలకు అతలాకుతలమైన గ్రామాలను సందర్శించారు. కూసుమంచి మండలంలో నాయకన్ గూడెం, నర్సింహుల గూడెం, పెరిక సింగారం, కూసుమంచి గ్రామాలను, నేలకొండపల్లి మండలంలో బుద్ధారం, కట్టుకాచారం గ్రామాలను, ఖమ్మం రూరల్ మండలంలో జలగంనగర్, కరుణగిరి పరిసరా ప్రాంతాలను సందర్శించారు. వరద బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నాయకన్ గూడెంలో వరదల్లో కొట్టుకుని పోయిన యాకుబ్ కుటంబాన్ని పరామర్శించారు. అతని భార్య ఆచూకీని వీలైనంత త్వరగా గుర్తించాలని అధికారులను కోరారు. నేలకొండపల్లి బుద్ధారంలో వర్షాలకు కొట్టుకుని పోయిన బ్రిడ్జి, రోడ్డు పనులను వీలైనంత త్వరగా మరమ్మత్తులు చేయించాలని ఫోన్ ద్వారా కోరారు. కట్టుకాచారంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని విద్యుత్ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ముఖ్య కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పై ఇన్ఫోటెక్ సాఫ్ట్వేర్ కంపెనీకి యస్.బి.ఐ.టి. విద్యార్థుల ఎంపిక



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు** :విద్యతో పాటు ఉన్నత విలువలు కలిగి ఉండాలని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. స్థానిక యస్.బి.ఐ.టి. కళాశాలలో మంగళవారం నిర్వహించిన పై ఇన్ఫోటెక్ ప్రాంగణ నియామకాలలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రస్తుత ఆర్థిక మాంద్యంలో కూడా ప్రాంగణ నియామకాలు చేపట్టడం, వాటిలో తమ విద్యార్థులు ప్రతిభను చాటటం పట్ల వారు హర్షం వ్యక్తం చేసారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు వారు పనిచేసే ప్రాంతంలో విలువలతో కూడిన వ్యక్తిత్వం కలిగి ఉండాలని వారికి దిశనిర్దేశ్యం చేసారు. ఐటి సర్వీసెస్ మరియు ఐటి ప్రోవైడర్ కంపెనీ అయిన పై ఇన్ఫోటెక్ సంస్థలో జూనియర్ సాఫ్ట్వేర్ డెవలప్పర్ ఉద్యోగానికి కళాశాలలో జరిగిన ప్రాంగణ నియామకాలలో 185 మంది యస్.బి.ఐ.టి. విద్యార్థులు పాల్గొనగా 72 మంది మౌకిక పరీక్షకు అర్హత సాధించారు. వీరిలో చివరి దశలో 13 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా? జి. ధాత్రి తెలిపారు. పై ఇన్ఫోటెక్ సంస్థకు అర్హత సాధించిన విద్యార్థులకు 3 నెలలు శిక్షణను ఇప్పిస్తారని ఈ సమయంలో వారికి నెలకు 25,000/- రూపాయలు స్టైఫండ్ అందుతుందని కళాశాల ప్రిన్సిపల్ డా? జి. రాజ్ కుమార్ తెలిపారు. శిక్షణ అనంతరం వార్షిక ఆధాయంగా 8 లక్షల నుండి 9 లక్షల వరకు అందుతుందని వారు తెలియచేసారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో పై ఇన్ఫోటెక్ హెచ్. ఆర్. డైరెక్టర్ విజయ్ జైస్వాల్, హెచ్.ఆర్. మేనేజర్ పియూష్ తివారి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా? కె. అమిత్ బింధాజ్, అకడమిక్ డైరెక్టర్స్, గంధం శ్రీనివాసరావు, డా? ఎ.వి.వి. శివ ప్రసాద్, జి. ప్రవీణ్ కుమార్, డా? జె. రవీంద్రబాబు, డా? యన్. శ్రీనివాసరావు, టి.పి.ఒ. యన్. సవిత, కోఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వేగంగా పునరుద్ధరణ పనులు

## -సూపెరింటెండింగ్ ఇంజనీర్ సురేందర్



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు** :గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పలు చోట్ల స్తంబాలు విరిగి పడడం, ట్రాన్స్ఫార్మర్లు నీటిలో మునిగిపోవడం, ట్రాన్స్ఫార్మర్ల గద్దెలు , ఇన్సులేటర్లు దెబ్బతినడం వలన విద్యుత్ అంతరాయాలు తీవ్రంగా జరగడం పట్ల ఖమ్మం సర్కిల్ పరిధిలో వేగంగా విద్యుత్ పున్నరుద్ధరణ పనులు చేపట్టడం జరిగిందని సూపెరింటెండింగ్ ఇంజనీర్ సురేందర్ తెలిపారు . ఈ సందర్బంగా సూపెరింటెండింగ్ ఇంజనీర్ సురేందర్ మాట్లాడుతూ ... విద్యుత్ సరఫరా లో ఎక్కడ అంతరాయాలు లేకుండా సిబ్బంది అహోరాత్రులు శ్రమించి యుద్ధప్రాతిపదికన పున్నరుద్ధరణ పనులు చేపట్టామని , ఎక్కడ కూడా అంతరాయాలు లేకుండా సరఫరా అందించామన్నారు . పక్క డివిజన్ లో ఉన్న సిబ్బంది ని కూడా పిలిపించుకొని పున్నరుద్ధరణ పనులు చేపట్టడం జరిగిందని చెప్పారు. కొన్ని చోట్లా నీళ్లలో గృహాలు మునగడం చేత వారికి కరెంట్ సరఫరా అందించలేకపోతున్నామని , కారణం తడిగా ఉండటం చేత షాక్ కు గురైయ్యే ప్రమాదం ఉందని అన్నారు . వర్షాన్ని, వరదలను సైతం లెక్కచేయకుండా చాలా సాహసోపేతంగా సిబ్బంది పనిచేస్తున్నారని ఈ సందర్భాంగా వారిని అభినందించారు. ఏజెన్సీలు అందుబాటులో బాటులో ఉన్నాయని అన్నారు. సరిపడా మెటీరియల్ ఉందని వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగుండా ఉండేందుకు మరింత అప్రమత్తంగా సిబ్బంది ఉండాలన్నారు. పునరుద్ధరణ పనులు చేసేటప్పుడు సిబ్బంది తప్పనిసరిగా స్వీయ జాగ్రత్తలు పాటించాలన్నారు. వినియోగదారులు విద్యుత్ పట్ల జాగ్రత్త వహించాలని , విద్యుత్ స్తంభాలు, ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డు లను తడి చేతులతో ముట్టుకోరాద్దన్నారు . స్వీయ నియంత్రణ ముఖ్యమని ఎట్టి పరిస్థితుల్లో స్వయంగా విద్యుత్ మరమ్మతులు చేప్పట్టరాదని కోరారు . గుర్తింపు ఉన్న ఎలెక్ట్రిషియన్ తో మాత్రమే స్విచ్ బోర్డు లను , వైర్లను రిపేర్లు చేసుకోవాలని సూచించారు . విద్యుత్ పట్ల జాగ్రత్త వహించండి. ప్రమాదాలు కొని తెచ్చుకోకండి అన్నారు .

# సహాయక చర్యలను తనిఖీ జిల్లా కలెక్టర్



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు** :మున్నేరు వరద ముంపు ప్రాంతాలు బొక్కలగడ్డ, మంచికంటి నగర్, వెంకటేశ్వర నగర్, బతుకమ్మ ఘాట్ రోడ్డు, ప్రకాష్ నగర్, మోతీనగర్, వినాయక ఘాట్, కాలువకట్ట లలో చేపడుతున్న సహాయక చర్యలను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి మంగళవారం తనిఖీలు చేశారు. కాలనీలలో ఇంటింటికి తిరుగుతూ పరిస్థితులను పరిశీలిస్తూ బాధితులకు ధైర్యం కల్పించారు. అధైర్య పడవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ అన్నారు. కలెక్టర్ ఇంటింటికి తిరిగి బాధితుల నష్టాన్ని, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాలు, వరదలు సృష్టించిన కష్టాలను కన్నీళ్ల చూస్తున్నట్లు, వాటినుండి సాధ్యమైనంత ఉపశమనం కల్గించేందుకు దగ్గరికి వచ్చామని వరద ముంపు బాధితులకు భరోసా ఇచ్చారు. కాలనీలలోని ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా త్రాగునీరు అందిస్తున్నామన్నారు. వీధులలో పేరుకుపోయిన బురదను శానిటేషన్ సిబ్బందితో శుభ్రపరుస్తున్నట్లు తెలిపారు. ఇళ్లలలో తడిచిన బియ్యం, నిరుపయోగమైన వస్తువులను ట్రాక్టర్లతో ఎత్తివేసే పనులు జరుగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముంపు ప్రాంత నిరాశ్రయులకు తక్షణమే నిత్యవసర సరుకులు, దుప్పట్ల పంపిణీకి ఏర్పాటు పూర్తి చేసినట్లు ఆయన అన్నారు. ఆస్తి నష్టం అంచనాలు తయారు చేసేందుకు అధికారుల బృందం ప్రత్యేకంగా తిరుగుతున్నారని, తక్షణ పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రకృతి నష్టంతో జరిగిన ప్రమాదం కాబట్టి అందోళన చెందవద్దని, సహాయక చర్యలు ముమ్మరంగా చేపట్టామని ప్రజలకు ధైర్యాన్ని కల్పించారు. కలెక్టర్ మున్నేరు ప్రవాహం ను పరిశీలించారు. పైన నుండి వచ్చే వరదను అంచనా వేయాలని అధికారులకు అదేశించారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ, ప్రజలకు వెన్నుదన్నుగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా ఖమ్మం నగరపాలక సంస్థ సహాయ కమీషనర్ సంపత్, అధికారులు, తదితరులు ఉన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## -రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.వి. కర్ణన్



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు** : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. మంగళవారం కమీషనర్, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి నగరంలోని మంచికంటినగర్ వరద ప్రభావిత ప్రాంతంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి వరద బాధితులను పరామర్శించారు. నష్టాన్ని చూసిన కమీషనర్ వారికి ఏమేం కావాలో అడిగి తెలుసుకున్నారు. మొబైల్ హెల్త్ బృందాలను ఏర్పాటుచేసినట్లు, ఇంటింటికి మొబైల్ బృందాలు తిరిగి, ఆరోగ్య సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాయని ఆయన అన్నారు. కమీషనర్ ఈ సందర్భంగా మొబైల్ బృందాల పనితీరును పరిశీలించారు. అనంతరం జిల్లా ప్రధాన ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. వరదల కారణంగా వ్యాధుల బారిన పడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. వారికి అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులు నిరంతరం అందుబాటులో ఉండి, మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను కమీషనర్ ఆదేశించారు. వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ పర్యటన సందర్భంగా నగరపాలక సంస్థ సహాయ కమీషనర్ సంపత్, డిప్యూటీ డిఎం%డ%హెచ్ఓ డా. సైదులు, జిల్లా ప్రధాన ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డా. కిరణ్ కుమార్, ఆర్ఎంఓ డా. రాంబాబు, అధికారులు, వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అధైర్య పడకండి ఇందిరమ్మ ప్రభుత్వం మీకు అండగా ఉంది

- మీ కష్టాలను కన్నీళ్లను తుడవడానికి మీ దగ్గరికి వచ్చాను
- వరద ముంపు బాధితులకు భరోసా ఇచ్చిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ముంపు ప్రాంత నిరాశ్రయులకు తక్షణమే నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని అధికారులకు ఆదేశం
- ముదిగొండ లో ముంపు ప్రాంతాలను పరిశీలించి ప్రజలకు ధైర్యాన్ని కల్పించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు** : 'మీ కష్టాలను తీర్చడానికి... మీ కన్నీళ్లు తుడవడానికి నేను వచ్చాను. మీరు అధైర్య పడకండి. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం మిమ్మల్నిహా ఆదుకుంటుందని" వరద ముంపు ప్రాంతాల బాధితులకుహాడిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ధైర్యం చెప్పి భరోసా ఇచ్చారు. మంగళవారం మధిర నియోజకవర్గం ముదిగొండ మండలం న్యూ లక్ష్మీపురం, పండ్రేగుపల్లి గ్రామాలలో మున్నేరు వరద ముంపు ప్రాంతాలను డిప్యూటీ సీఎం పరిశీలించారు. న్యూ లక్ష్మీపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో పెద్ద బొంగు వీరబాబు, పల్లె పొంగు కళావతి ఇండ్ల లోకి నీరు చేరడంతో తడిసిన వస్తువులను పరిశీలించి వారికి ధైర్యం చెప్పారు. తక్షణమే ప్రభుత్వం నుంచి నిత్యవసర సరుకులను ఇప్పిస్తానని వారికి భరోసా ఇచ్చారు. ఎస్సీ కాలనీకి వరదముంపు రాకుండా శాశ్వత పరిష్కారం చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిప్యూటీ సీఎంకు విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత పండ్రేగుపల్లి లో మున్నేరు కరకట్ట తెగి ఇండ్ల లోకి నీరు వచ్చిన డబుల్ బెడ్ రూమ్ కాలనీని సందర్శించారు.హా వర్షాలకు దెబ్బతిని కూలిపోయిన వజీర్ పాషా రేకుల ఇంటిని పరిశీలించి బాధితులకు మనోధైర్యం కల్పించారు. కరకట్ట తెగి నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి రైతులకు నేనున్నానంటూ భరోసా ఇచ్చారు.హా వ్యవసాయ శాఖ అధికారులను పంపించి ప్రాథమికంగా పంట నష్టం అంచనా వేయించిన తర్వాత పరిహారం అందిస్తామని వారికి హామీ ఇచ్చారు. పండ్రేగుపల్లి తండాలో వర్షానికి కూలిపోయిన ఖమ్మం -కూసుమంచి 132 కెవి హై టెన్షన్ టవర్ ను పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు పనులు చేయాలని ఏడి బాబు నాయక్ ఆదేశించారు. జిల్లాలో ఉన్న ఇతర టవర్ల పరిస్థితుల గురించి ఆరా తీశారు. వరద ముంపు బాధితులకు తక్షణ సాయం కింద నిత్యవసర సరుకులను అందజేయాలని తహసిల్దార్ కరుణాకర్ రెడ్డిని ఆదేశించారు. నీట మునిగిన పంట పొలాల వివరాలు నష్టం అంచనాలు వెంటనే తయారుచేసి ప్రాథమిక నివేదిక పంపించాలని మండల వ్యవసాయ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, డిసిసి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ముదిగొండ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, నియోజకవర్గ నాయకులు ఆయా గ్రామ శాఖల అధ్యక్షులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి దక్కాలని పాదయాత్ర



**మక్తల్ , తెలంగాణ ముచ్చట్లు:** తమ అభిమాన నాయకుడు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి దక్కాలని కోరుతూ,అమరచింత మండలము కాంగ్రెస్ పార్టీ నాయకులు పాదయాత్ర చేశారు. అమరచింత మండలం చంద్రనాయక్ తండాకు చెందిన హన్మంతు నాయక్ ( ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు), సూర్యనాయక్ ఇద్దరూ తమ ఊరి నుంచి దాదాపు 45 కిలోమీటర్ల మక్తల్ కు పాదయాత్ర నిర్వహించారు. తెల్లవారుజామున నాలుగున్నర కు పాదయాత్ర ప్రారంభించామని, సాయంత్రం అయిదు గంటల వరకు మక్తల్ పట్టణానికి చేరుకున్నామని అన్నారు . అనంతరం స్థానిక పడమటి ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మక్తల్ కాంగ్రెస్ పార్టీ నేతలు వారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి దక్కితే వెనుకబడిన మక్తల్ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు కట్టా సురేష్ గుప్తా, బోయ రవికుమార్, నాగరాజు, ఓబ్లేశ్, కల్లూరి గోవర్ధన్, గుంతలి రవి, వేణు గౌడ్, సురేందర్ గౌడ్, ఇతర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక



## చెరువులో పూలు చల్లినంత మాత్రాన ప్రజలు విశ్వసించరు

### -గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బంగ్లా బాబు రెడీ

వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు: రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామ పెద్ద చెరువు నిండడం జరిగింది. మంగళవారం మాజీమంత్రి నిరంజన్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి వెల్టూర్ చెరువును సందర్శించి గంగమ్మ తల్లికి పూజ నిర్వహించడం జరిగింది. దీంతో వెల్టూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బంగ్లా బాబు స్పందిస్తూ.. వర్షాలతో చెరువు నిండి అలుగు పారితే అవగాహన లేకుండా బీఆర్ఎస్ నాయకులు చెరువులో పూలు చల్లడం, పూజలు నిర్వహిస్తూ.. ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. గత పాలకులు అభివృద్ధి పేరుతో అందిన కాడికి దోచుకున్నారని ఎద్దేవా చేశారు. చెరువులను అడ్డం పెట్టుకొని భూ కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు చెరువులపై చూపుతున్న వైఖరిని ప్రజలు విశ్వసించే పరిస్థితిలో లేరని అన్నారు.భారీగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అలాగే సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలను కోరారు. ఎమ్మెల్యే మేఘా రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో అనేక అభివృద్ధి పనులు, అలాగే సిసి రోడ్ల నిర్మాణం పనులను చేపట్టడం జరిగిందని తెలిపారు.

## సాహిత్యం ముందు తరాలకు ఆదర్శం

### - జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :సాహిత్యం భావి తరాలకు ఆదర్శంగా నిలుస్తుందని దీనితోపాటు నైపుణ్యం కూడా ఉంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం ఆనందఖని లోని టీచర్స్ ట్రైనింగ్ సెంటర్ లో తెలంగాణ సాహిత్య పరిషత్ హైదరాబాద్ వారు నిర్వహించిన కార్యక్రమం లో ముఖ్య అతిథి గా హాజరై భద్రా ద్రి కొత్తగూడెం జిల్లా సమగ్ర స్వరూపం గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా చరిత్ర ను గ్రంథ స్థం చేసి భా వితరాలకు అందించడం శుభదాయకం అని, మన జిల్లా లో ఎంతో సాహిత్యం,చరిత్ర ఉందని దానిని విద్యార్థులకు ఉపాధ్యాయులే అందించాలని సాహిత్యం ద్వారా విద్యార్థుల లో మంచి నైపుణ్యాలు పెంపొందుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లావిద్యాధికారి యం వెంకటేశ్వరాచారి, సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య నవభారత్ వైస్ ప్రెసిడెంట్ శే ఖర్ బాబు జిల్లా మానిటరింగ్ అధికారి గ్రంథ కన్వీనర్ డాక్టర్ సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు కోర్ కమిటీ సభ్యులు రచయితలు పాల్గొన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు

**- ముందస్తు చర్యల వల్ల మూడు వేల మందిని రక్షించాం**
**- రాష్ట్ర వ్యాప్తంగా 133 పునరావాస కేంద్రాలు**
**- వరద ప్రాంతాలల్లో ఆహారం, త్రాగునీరుకు ఏలోటు రావద్దు**
**- రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**





ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు: కష్ట కాలంలో ఉన్న ప్రజలను కాపాడుకునేందుకు వరద ప్రభావిత ప్రాంతాలల్లో యుద్ధ ప్రాతిపదికన పునరుద్దరణ పనులు చేపట్టాలని రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వర్షాలు, వరదలు సహాయక చర్యలపై ఒకవైపు తన నియోజక వర్గం పాలేరులో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ బాధితులకు భరోసా కల్పిస్తూనే మరోవైపు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పరిస్థితులను మంగళవారం ఆయా జిల్లా కలెక్టర్లతో టెలిఫోన్ లో సమీక్షించారు. పాలేరు నియోజక వర్గంలోని ఖమ్మం రూరల్, తిరుమలయపాలెం మండలాలల్లో పర్యటించారు. గంట గంటకు హైదరాబాద్ లోని విపత్తుల నిర్వహణ విభాగం అధికారులతో మాట్లాడుతూ అప్రమత్తం చేస్తూ వారికి ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీచేస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలల్లో నెలకొన్న పరిస్థితులకు అనుగుణంగా సహాయక చర్యలు కొనసాగించాలని మంత్రి గారు అధికారులను ఆదేశించారు. విపత్తుల నిర్వహణ విభాగంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కు వస్తున్న ఫిర్యాదులు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగితెలుసుకున్నారు. పంట నష్టం, ఆస్తి నష్టం వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని పూర్తి వివరాలను జిల్లాల నుంచి తెప్పించుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం రాష్ట్రంలో 117 గ్రామాలలో 67 వేల మంది భారీ వర్షాలు, వరదల వల్ల ప్రభావితమయ్యారని, ఇందులో ఒక ఖమ్మం జిల్లాలోనే 49 వేల మంది ఉన్నారని తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 133 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి 10,538 మందిని తరలించడం జరిగిందని తెలిపారు. తమ ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలవల్ల 3039 మందిని రక్షించుకోగలిగామని తెలిపారు. ప్రాథమిక అంచనా ప్రకారం ఇప్పటి వరకు 44 ఇండ్లు పూర్తిగా దెబ్బతినగా 600 ఇండ్లవరకు పాక్షికంగా దెబ్బతిన్నాయని తెలిపారు. అయితే ఇండ్లు పూర్తిగా కోల్పోయిన వారికి కొత్తగా మంజూరుచేయాలని, పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్లకు మరమ్మతులను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 51 బ్రిడ్జిలు, 249 కల్వర్ట్స్, 166 ట్యాంక్ లు దెబ్బతిన్నాయని, 13,342 జీవాలు మృతి చెందాయని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాలల్లో ఆహారం త్రాగునీరుకు ఏలోటు లేకుండా అందించాలని ఆదేశించారు. వరద భాదితులు ఎదురు చూడవలసిన పరిస్థితులు కల్పించకుండా సమహాయానికి ఆహారాన్ని అందించాలన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో అసలైన సవాలు ఇప్పుడు ఎదురవుతుందని మానవీయ కోణంలో సహాయ చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా వృద్దులు, గర్భిణీలు, పసిపిల్లలు, దివ్యాంగుల విషయములో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మరికొన్ని రోజులు ఇదేవిధంగా అప్రమత్తంగా ఉండాలని, నష్ట పోయిన వారందరిని ఆదుకొంటూ కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలవాలని అన్నారు. ప్రతీ ఒక్కరూ మళ్లీ సాధారణ జీవితం గడిపేలా చరవేగంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు తగ్గడంతో వరదలు తగ్గుముఖం పట్టి బురదమయమైన ప్రాంతాలల్లో అంటువ్యాదులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

# సమస్యల వలయంలో యస్ఆర్ బిజీయన్ఆర్!?

### పరిష్కారం కొరకు పూర్వ విద్యార్థుల సంఘం కృషి



ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు : తెలంగాణాలోనే విద్యాసామర్థ్యాలు అందించడంలో, వసతి సౌకర్యాలులో ముందుండి, నాక్ గుర్తింపు లభించినప్పటికీ కళాశాల ఇంకా అనేక సమస్యలను ఎదుర్కొంటుంది. కళాశాలకు అటానమస్ స్టేటస్ తో గౌరవప్రదమైన స్థానంలో ఉన్నప్పటికీ కళాశాలలో సౌకర్యాలు "పేరుగొప్ప –ఊరు దిబ్బ" అన్న సామెతను గుర్తు చేసేవిగా ఉన్నాయి. కళాశాల పూర్వ విద్యార్థి సంఘం తమశాయ శక్తుల సమస్యలు పరిష్కారం కొరకు ఈవేదికను వినియోగం చేసుకుంటుంది. ఈక్రిందిసమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తుంది. ఆదిశగానే కళాశాల పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం కార్యక్రమాన్ని ముందుకు తీసుకు పోతుంది. కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాము 1) గతంలో మా పూర్వ విద్యార్థి సంఘం చేసిన విజ్ఞాపన మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు యూనివర్సిటీ ఏర్పాటు గురించి కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చేర్పించారు. ఎస్ ఆర్ అండ్ బిజివిన్ ఆర్ కళాశాలకు వసతులు, చరిత్ర, న్యాక్ఎం గుర్తింపుతో యూనివర్సిటీ అర్హత ఉన్నందున ఈ కళాశాలను తమప్రభుత్వం వాగ్దానం చేసిన విధంగా ఈకళాశాలను యూనివర్సిటీగా అప్ గ్రేడ్ చేయాలని మేము కోరుతున్నాం. 2) ఇప్పటికే యస్ఆర్ బిజీయన్ఆర్ కళాశాలలో 12పోస్టుగ్రాడ్యేషన్ కోర్స్ లు నడుస్తున్నాయి. ఈఏడాది అదనంగా కాకతీయ యూనివర్సిటీ ఈకళాశాలకు యంయస్సీ, గణితం కోర్స్ మంజూరు చేసింది. ఈ13 పిజి కోర్సులకు అధ్యాపకులు ఉన్నారు. అధ్యాపకులు ఉన్నప్పటికీ తరగతి గదులు లేవు. బోధన ఇబ్బందిగా మారింది. ఈ ఇబ్బందిని దృష్టిలో ఉంచుకొని పిజి తరగతుల నిర్వహణ కొరకు కళాశాలలో తరగతి గదులు నిర్మించాలని పూర్వ విద్యార్థుల సంఘం కోరుతుంది. ఇటీవలనే కళాశాలకు యంయస్సీ గణితం బోధించడానికి అనుమతి లభించింది. 3) జిల్లా కోర్టు సముదాయం, ఐటి హబ్ ఇక్కడ నుండి తరలించే పక్షంలో ఆ భవనాలను యస్ఆర్%d% బిజీయన్ఆర్ కళాశాలకు అప్పగించాలి. ఇప్పటికే ఖాళీ అయిన కూరగాయల మార్కెట్ నడిచిన స్థలం వెంటనే కళాశాల పిజి సెంటర్ కు అప్పగించాలని సంఘం కోరుతుంది. 4) కళాశాల ప్రిన్సిపాల్ కు తెలియకుండా ఇకనుండి. కళాశాల స్థలం బోధనేతర భవనాలు, ఇతరత్రా వ్యాపార సముదాయాలకు కేటాయించ వద్దని, ఆక్రమణల నుండి కళాశాల భూమిని కాపాడాలని ప్రభుత్వంకు మాసంఘం విన్నవించుకుంటుంది. 5)కాదా బిల్డింగ్ కు సంబంధించి, కళాశాల భూమి వాడుకున్నందుకు చెల్లించిన అద్దె గత 40ఏళ్ళుగా జిల్లా ఉన్నతాధికారి ఖాతాలో ప్రోగుపడి ఉంది, ఆ అద్దె అమౌంట్ మొత్తం కళాశాలకు కెటాయించి కళాశాల మరమ్మత్తులు జరిపించాలని కోరుతున్నాం. 6) కళాశాల ఎదురుగా ఉన్న ఇల్లెందు రోడ్డు(ఇల్లెందు క్రాస్ రోడ్ నుండి యన్టీఆర్ బొమ్మ వరకు)కు మన కళాశాల భూరి విరాళం దాత గెంటేల నారాయణరావు మార్గంగా నామ కరణం చేయాలి. అందుకు ఖమ్మం కార్పొరేషన్ సహకారం అందజేయాలి. 7)గెంటేల నారాయణరావు విగ్రహంను ఇల్లెందు క్రాస్ రోడ్లో, లేదా ఖమ్మం ట్యాంక్ బండ్ పైన గానీ ఏర్పాటు చేయాలి. 8) ప్రభుత్వం జిల్లాలలో నూతనంగా ప్రారంభిస్తున్న నాలెడ్జ్ హబ్ ను ఈకళాశాలకు కెటాయించాలి. 9) ప్రైవేటు యూనివర్సిటీ ప్రతిపాదనను రద్దు చేయాలి. ఇక స్మృతి వనంగా ప్రకటించిన బొటానికల్ గార్డెన్ నిర్వాహణ నిధుల లేమితో అంతంత మాత్రంగానే ఉంది. కళాశాల ఖాళీస్థలం సైతం ఉపయోగంలోనికి తేవాలసి ఉంది. కళాశాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఈ డిమాండులను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని కోరుతున్నాము. ఈకార్యక్రమంకు హాజరు కానున్న మంత్రుల దృష్టికి వినతిపత్రం అందజేయడం ద్వారా కళాశాల న్యాయబద్ధమైన సమస్యలు తీసుకెళ్ళనున్నట్లు యస్ఆర్ బిజీయన్ఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షప్రధాన కార్యదర్శులు నల్లమోతు తిరుమలరావు, వీరెల్లి ఆనంద్ కుమార్ లు తెలిపారు.

# విద్యార్థులకు రుచిగా సుచిగా ఆహారాన్ని అందించాలి

### జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

నెల్లూరు,తెలంగాణ ముచ్చట్లు : 4 నెల్లూరు, జిల్లాలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజనం పాఠశాల విద్యార్థులకు రుచిగా సుచిగా ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజనం కార్యక్రమం అమలుపై మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల తల్లుల కమిటీ చైర్పర్సన్లు, కుకింగ్ ఏజెన్సీలకు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజనం కార్యక్రమంలో 2వేల570 పాఠశాలల్లో 1 లక్ష 66వేల 56 మంది విద్యార్థులు ప్రతిరోజు మధ్యాహ్న భోజనం తీసుకుంటు న్నారన్నారు. మధ్యాహ్నం బడి భోజనం కార్యక్రమం ద్వారా పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్నారు. మధ్యాహ్నం బడి భోజనం కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో విద్యార్థుల హాజర శాతాన్ని పెంచాలన్నారు. జిల్లాలో స్థానిక పరిస్థితులను బట్టి పాఠశాలల్లో విద్యార్థులకు ఆహార మెనూలో మార్పులు చేయాలని ఆయన సూచించారు. జిల్లాలోనిపాఠశాలల్లో విద్యార్థులు కోరిన విధంగా మధ్యాహ్నం బడి భోజనంలో మార్పులు చేయాలన్నారు. పాఠశాలలలో విద్యార్థులు ఇష్టంగా తినే ఆహారాన్ని అందించడానికి అధికారులు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆయన సూచించారు. పాఠశాల తల్లుల కమిటీ చైర్ పర్సన్ లు పాఠశాలల వాతా వరణంలో మార్పులు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలోజిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్ కుమార్ , మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానో పాధ్యాయులు, కుకింగ్ ఏజెన్సీలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు

బుధవారం 4 -09- 2024

వరంగల్



# ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్న సేవా సమితి ఆధ్వర్యంలో ఫ్యాన్ల వితరణ

**మక్తల్, తెలంగాణ ముచ్చట్లు:** నియోజకవర్గంలో విద్యాలయాల అభివృద్ధికి అందరూ కలిసి రావాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని అందులో భాగంగా నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం అన్ని నియోజకవర్గాల కన్నా ఎక్కువ నిధులను రూ. 17 కోట్ల రూపాయలను కేటాయించడం జరిగిందన్నారు .వాటితో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మంగళవారం మక్తల్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఓ సమావేశంలో మక్తల్ పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు బోయ రవికుమార్, ఇతర కాంగ్రెస్ బృందం సమిష్టిగా సేవా గుణాన్ని చాటుకున్నారు. వాకిటి శ్రీహరి అన్న సేవా సమితి పేరిట ఎమ్మెల్యే చేతుల మీదుగా బీసీ బాలుర గురుకుల పాఠశాల మక్తల్ కు 20 సీలింగ్ ఫ్యాన్లను పాఠశాల ప్రిన్సిపాల్ సెగ్రీ సిబ్బందికి అందజేశారు. గత నెల ఆగస్ట్ 14వ తేదీన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి బీసీ గురుకులంలో నిద్ర చేయగా,విద్యార్థులు ఫ్యాన్లు లేవని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.ఆమేరకు మక్తల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఫ్యాన్లను ఆందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ,పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఆందరూ కలిసి,బీసీ గురుకుల విద్యార్థులకు ఫ్యాన్లు అందించడం సంతోషంగా ఉందన్నారు. ఇదేవిధంగా మక్తల్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా ఉన్నతస్థాయి లోనివారు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. దాదాపుగా ప్రస్తుతం అన్నీ పార్టీలలోని ప్రజాప్రతినిధులు నాయకులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిన వారు ఉన్నారని వారంతా కూడా తాము చదువుకున్న పాఠశాలలో పాఠశాల అభివృద్ధి కనీస మౌలిక వసతుల కల్పనకు ముందుకు రావాలని అన్నారు .ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన వసతులను కల్పించవలసిందిగా ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వపరంగా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనకు నియోజకవర్గంలో రూ. 17 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి నిధుల్లోనూ 30 శాతం నిధులు పాఠశాలల అభివృద్ధికి కెటాయించనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.ప్రభుత్వ




పరంగానే కాకుండా ప్రతి ఒక్కరూ తమవంతుగా విద్యాలయాల అభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు ,కేజీబీవీ విద్యాలయాలు అన్నింటిలోనూ విద్యార్థులకు అవసరమైన సదుపాయాల కల్పనకు తమ వంతు సహకారం అందించవలసిందిగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి విజ్ఞప్తి చేశారు. గత నెల 14న మక్తల్ పట్టణంలోని బీసీ గురుకుల పాఠశాలలో రాత్రివేళ నిద్రించిన సందర్భంగా ప్రతి నెల ఒక గురుకులంలో నిద్రించాలనే నిర్ణయం తీసుకోవడం జరిగిందని ఆ సందర్భంగా అక్కడి విద్యార్థులకు ఫ్యాన్లు లేని విషయాన్ని విద్యార్థులు తెలియజేయడం జరిగిందన్నారు. ఆమేరకు ఫ్యాన్లు అందజేసేందుకు పట్టణ కాంగ్రెస్ నాయకులు ముందుకు రావడం అభినందనీయమని అంటూ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ రవికుమార్ తో పాటు సేవా కార్యక్రమంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరిని ఆయన అభినందించారు. అయితే తన పేరుతో సేవా సమితి పేరిట కార్యక్రమాలు చేపట్టడం కన్నా ఒక సేవ సమితిగా ఒక పేరును నిర్ణయించి సేవా కార్యక్రమాలను ఇక ముందు కూడా కొనసాగించవలసిందిగా ఆయన పట్టణ కాంగ్రెస్ నాయకులకు సూచించారు. తాను రానున్న రోజుల్లో పాఠశాలలో వసతుల కల్పనకు తనవంతు పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జి. లక్ష్మారెడ్డి, నాయకులు కట్టా సురేష్ కుమార్ గుప్తా, బి.గణేష్ కుమార్, ఆనంద్ గౌడ్, చంద్రకాంత్ గౌడ్, బోయ వెంకటేష్, కట్టా వెంకటేష్, శీను ,నూరుద్దీన్, హుసాముద్దీన్, సాదిక్, ఫయాజ్, ఓబ్లేశ్ కావలి రాజేందర్, కల్లూరి గోవర్ధన్, గుంతలి రవి, బోయ నర్సింహ, మెకానిక్ రాము తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసుకోవాలి

## - ముంపు ప్రాంతాలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలి - వరద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటాం.. - జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** త్వరలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి జిల్లా అధికార యంత్రాంగం అన్ని విధాల ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో ఎంపీడీవోలు,తహసిల్దారులతో పలు అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ




సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సిబ్బందికి విధుల కేటాయింపు వంటి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఎన్నికలకు కేటాయించిన సిబ్బందికి తగిన విధంగా శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. భారీ వర్షాలు, వరదలకు జిల్లాలో దెబ్బతిన్న రోడ్ల విషయంలో స్థానికంగా పడిన గుంతలను పూడ్చాలని, అదేవిధంగా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని దీని విషయంలో పంచాయతీరాజ్ అధికారులు అంచనాలను రూపొందించాలన్నారు.భారీగా వరదలు వచ్చిన నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పంచాయతీ అధికారులు,సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి శానిటేషన్ పనులను ముమ్మరం చేయాలని చెప్పారు. ఎప్పటికప్పుడు చెత్తాచెదారం లేకుండా తొలగించాలని దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతూనే గ్రామాల్లో ప్రతిరోజు ఫాగింగ్ చేయాలన్నారు. అదేవిధంగా ముంపు ప్రాంతాలలో ప్రత్యేక పారిశుద్ధ పనులను చేపట్టి బ్లీచింగ్ పౌడర్ ను చల్లించాలన్నారు. గ్రామాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలతో పాటు ప్రధాన రహదారులకు పక్కన ఇంకుడు గుంతలను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. మరో నాలుగైదు రోజులు వర్ష సూచన ఉన్నందున ముంపు ప్రాంతాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని చెప్పారు. అటు గోదావరి ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో సంబంధిత ముంపు ప్రాంత మండలాల అధికారులు గర్భిణీ స్త్రీలు, వృద్ధులను తరలించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు వరద ఉధృతిని గమనిస్తూ ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి అక్కడ అన్ని రకాల సౌకర్యాలు కల్పించే విధంగా వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా పునరావస కేంద్రాల్లో విద్యుత్తు, మంచినీటి సౌకర్యం, ఆహార పదార్థాలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వైద్యశాఖ అధికారులు, మెడికల్ ఆఫీసర్లు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ సిబ్బందిని అందుబాటులో ఉంచుతూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని చెప్పారు. భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న ఇళ్లకు, పూర్తిగా దంసమైన ఇళ్లకు, చనిపోయిన పశువులకు,గేదెలకు ప్రభుత్వ నిర్ణయించిన ప్రకారం నష్టపరిహాన్ని బాధితులకు అందజేసే విధంగా వెంటనే చర్యలు చేపట్టాలని మండల అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్,డీఆర్డీఓ విద్యా చందన, సిపిఓ శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఎస్ఈ మహేందర్, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, పాల్వంచ మున్సిపల్ కమిషనర్ డాకుసింగ్, డిసిహెచ్ రవిబాబు, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, డిపిఓ చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయి

- తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకే మా పై దాడి చేశారు
- మీలాంటి పిట్ట బెదిరింపులకు భయపడం బిడ్డ..! ఖబడ్దార్!
- బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు...
- మున్నేరు బాధితులను రూ. 2 లక్షల నష్టపరిహారం చెల్లించాలి..
- వరద ముంపు లో చనిపోయిన కుటుంబానికి రూ. 25 లక్షలు ఇవ్వాలి...
- మున్నేరు బాధితులను పరామర్శించేందుక వెళ్లితే దాడులు చేస్తున్నారు...
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** ఖమ్మం వరద ముంపు ప్రాంతాల్లో అందుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి వైఫల్యం చెందిందని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ఆరోపించారు. మంగళవారం ఖమ్మం నగరంలో మున్నేరు పరివాహక ప్రాంతాలను సందర్శించి తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తో కలిసి మాట్లాడారు.... ఖమ్మం నగరంలో మున్నేరు వరద ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం వహించినట్లు కనిపిస్తుందన్నారు. వాతావరణ శాఖ అధికారులు గత మూడు రోజుల నుంచి హెచ్చరిస్తున్న జిల్లాలో ఉన్న మంత్రులు ఏం చేశారని ప్రశ్నించారు. వరద వచ్చి మూడు రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు సరైన చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ పని తీరు కు ఇదే నిదర్శనమన్నారు. ఖమ్మం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి సమీక్ష సమావేశంలో నష్టాలను అంచనా వేయకుండా ఉపన్యాసాలు ఇచ్చి వెళ్లారని ఆరోపించారు. మున్నేరు ప్రాంతంలో చూసే ఏడుపు వచ్చే సంఘటనలు కనిపిస్తున్నాయని, ఇప్పటి వరకు ఎలాంటి సహాయక చర్యలు చేపట్టలేదన్నారు. మంచినీటి, కరెంట్, శానిటేషన్ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని మాకు చెప్పడం జరిగిందన్నారు. మున్నేరు ముంపు ప్రాంతాలకు సీఎం రేవంత్ రెడ్డి వచ్చి తక్షణమే రూ 10 వేల రూపాయలు ప్రకటించడం ఎంతవరకు సమంజసం అన్నారు. ప్రతి ఇంట్లో రూ. 2 నుంచి రూ. 5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఆయన అన్నారు. మూడు రోజుల గడుస్తున్న పూర్తి స్థాయిలో కరెంట్ వ్యవస్థను పునరుద్ధరించలేదని ఆరోపించారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇదే రేవంత్ రెడ్డి, సీతక్క వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.25 లక్షలు ఇవ్వాలని చెప్పారని, ఇప్పుడు మేము అదే చెప్తున్నాం.. మీరు చెప్పిన రూ.25 లక్షలు ఇప్పుడు




చనిపోయిన వారి కుటుంబాలకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 30 మంది చనిపోతే, రాష్ట్ర ప్రభుత్వం 16 మంది చనిపోయారని నివేదిక విడుదల చేయడం సిగ్గు చేటన్నారు. తెలంగాణ రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీకి 8, బీజేపీకి 8 సీట్లు ఇచ్చిన వారు వరద ముంపు బాధితులకు ఇచ్చింది గుండు సున్నా అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఇంత పెద్ద ఎత్తున విపత్తులు సంభవించినప్పుడు ఎందుకు బీజేపీ ఎంపీ మౌనం వహిస్తున్నారో ప్రజలకు చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష పార్టీలను ఢిల్లీకు తీసుకెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. చనిపోయిన కుటుంబాలకు రూ. 25 లక్షలు, మున్నేరు ముంపు బాధితులకు రూ. లక్షలు నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రాంతాల్లో తక్షణమే చర్యలు తీసుకొని ప్రజలను సురక్షితంగా వారి వారి ఇళ్లల్లోకి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు జగదీశ్వర్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, వివేకానంద గౌడ్, పాడి కౌశిక్ రెడ్డి,లింగాల కమల్ రాజు,కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితుల సహాయార్థం వేమిరెడ్డి దంపతుల భారీ విరాళం

## - వరద బాధితులను ఆదుకునేందుకు రూ. కోటి విరాళం అందజేత - విజయవాడలో సీఎం చంద్రబాబుకి చెక్కు అందించిన వేమిరెడ్డి దంపతులు

**నెల్లూరు, తెలంగాణ ముచ్చట్లు :** నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు భారీ విరాళం అందిం చారు. వరదలతో తీవ్రంగా నష్ట పోయిన వారికి సహాయ సహకా రాలు అందించేందుకు, వారిని ఆదుకునేందుకు కోటి రూపాయలను విరాళం అందించారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలో



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి కోటి రూపాయల చెక్కును అందించారు. ఇటీవల వచ్చిన వరదలతో విజయవాడ తీవ్రంగా నష్టపోయింది. వేలాదిమంది ప్రజలు తిండీ, నీరు లేక అల్లాడిపోయారు. ఇప్పటికీ పలు కాలనీలు జల దిగ్బంధంలో ఉండిపోయాయి. సీఎం చంద్రబాబు ఇప్పటికే దగ్గరుండి సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. అన్నార్తులు ఆకలితో అలమటిస్తున్నారు. ఈ నేపథ్యంలో వరదలతో తీవ్రంగా ఇబ్బందులు పడ్డ ప్రజల సహాయార్థం, వారి బాగోగుల కోసం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు కోటి రూపాయలను విరాళంగా అందించి మానవత్వం చాటుకున్నారు. విపత్తు నుంచి ప్రజలు త్వరగా బయటపడాలని వారు ఆకాంక్షించారు. రూ. కోటి రూపాయలు అందించిన వేమిరెడ్డి దంపతులను సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు , నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# 4న గణేష్ నిమజ్జన మహోత్సవ ఏర్పాట్లపై సమావేశం

### - నంద్యాల ఆర్డీఓ మల్లికార్జున్ రెడ్డి

నంద్యాల, తెలంగాణ ముచ్చట్లు : ఈ నెల 4వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3-00 గంటలకు కలెక్టరేట్ లోని సెంటినరీ హాలులో గణేష్ నిమజ్జన మహోత్సవ ఏర్పాట్లపై సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ మల్లికార్జున్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 11న స్థానిక చిన్నచెరువు కట్ట వద్ద ఉన్న వినాయక ఘాట్ లో గణేష్ నిమజ్జన మహోత్సవ ఏర్పాట్లకు సంబంధించి గణేష్ మహోత్సవ కేంద్ర సమితి కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న గణేష్ ఉత్సవ కేంద్ర సమితి కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొని సలహాలు, సూచనలిచ్చి విజయవంతానికి సహకరించాలని ఆర్డీఓ ఆప్రకటనలో పేర్కొన్నారు.

# డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం ( మిడ్ డే మీల్స్ ) కు సంబంధించి అవగాహన సదస్సు

### -ఇంకా మెరుగైన భోజనం అందించే దిశగా కృషి చేయాలి

### -జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి

అనంతపురం,తెలంగాణ ముచ్చట్లు : విద్యార్థులకు మెరుగైన భోజనం సేవలు అందే విధంగా చూడాలని అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని రెవిన్యూ భవనంలో జిల్లాలోని ఎంఈఓ లు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రిన్సిపాల్, సోషల్ వెల్ఫేర్ అసిస్టెట్స్,మిడ్ డే మిల్స్ ఏజెన్సీ వారు, ఎస్ఎంసి కమిటీ సభ్యులతో ఇంకా మెరుగైన మధ్యాహ్న భోజన పథకం అమలు పై సలహాలు, సూచనలు కొరకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ మాట్లాడుతూ.. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం ( మిడ్ డే మీల్స్ ) కు సంబంధించి అవగాహన సదస్సు నందు మధ్యాహ్న భోజనం పథకం సంబంధించి పలు అంశాలపై చర్చించడం జరిగిందని, గత నెల ఆగస్టు 30వ తేదీన బుక్కరాయసముద్రం, రోటరీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు తనిఖీ చేయడం జరిగిందని,ఈ సమయంలో మధ్యాహ్నం భోజనం తాను కూడా చేయడం జరిగిందని భోజనం బాగుందని అందులో గమనించింది ఏమంటే ఆకుకూరలు ఉన్నవి కానీ ఆకుకూరలు ఇంకా ఎక్కువగా ఉండేలా చూడాలన్నారు. తనిఖీ సందర్భంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులతో చాలాసేపు మాట్లాడటం జరిగిందని వారిలో చాలామంది పులిహోర ని, వెజ్ పలావ్ ఇష్టపడడం లేదని తెలిసింది.

ఒక్కొక్క ప్రాంతాలలో ఒక్కొక్క విధంగా ఆహారపు అలవాట్లు ఉంటాయని దానికి అనుగుణంగా వారికి కావాల్సిన, ఇష్టపడే, భోజన సౌకర్యాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకునేందుకు ఈ సదస్సు నందు చర్చించి అందరి సలహాలు సూచనలు ప్రభుత్వానికి తెలియజేసి ఇంకా మెరుగైన పౌష్టికాహారం ఇచ్చేందుకు కృషి చేసేందుకు తోడ్పడుతుందని తెలిపారు. అలాగే ఎంఈఓ లు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రిన్సిపాల్, సోషల్ వెల్ఫేర్ అసిస్టెట్స్,మిడ్ డే మిల్స్ ఏజెన్సీ వారు, ఎస్ఎంసి కమిటీ సభ్యులు అందరూ కలసి చర్చించి ఇంకా మెరుగైన భోజనం అందించే దిశగా కృషి చేయాలన్నారు. ఈ శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ ప్రతి జిల్లాలో స్కూళ్లను సందర్శిస్తున్నారని ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. అలాగే మిడ్ డే మీల్స్ ఏజెన్సీ వారు వారికున్న ఇబ్బందులను తెలపాలని, సలహాలను తెలపాలని చెప్పారు. వంట చేయుటకు ఎన్ని సిలిండర్లు నెలకు నివేదిక తయారుచేసి పంపించే విధంగా చూడాలన్నారు. కోడిగుడ్లను ఉడికించిన గుడ్లే కాకుండా, ఆమ్లెట్, ఫ్రై లా చేస్తే పిల్లలు ఇష్టపడి తింటారని కొందరు అభిప్రాయపడ్డారు. కొంతమంది పిల్లలు తక్కువ బరువుతో, సన్నగా ఉన్న పిల్లల కోసం ప్రత్యేకంగా ఏ విధమైన చర్యలు తీసుకుంటే బాగుంటుందో తెలపాలన్నారు. కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయుటకు స్థలం ఉన్నట్లయితే మధ్యాహ్నం భోజన కూరగాయలు పండించుకొనుటకు వీలుగా ఉంటుందని అలాంటి స్కూల్ లను గుర్తించాలని తెలిపారు. ఈ అవగాహన సదస్సు నందు అన్ని విషయాలను చర్చించి మెరుగైన మధ్యాహ్నం భోజనం కోసం సలహాలు సూచనలతో నివేదికలు ప్రభుత్వానికి సమర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో వరలక్ష్మి, ఏపీసి నాగరాజు, ఎంఈఓలు,మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రిన్సిపాల్, సోషల్ వెల్ఫేర్ అసిస్టెట్స్,మిడ్ డే మిల్స్ ఏజెన్సీ వారు, ఎస్ఎంసి కమిటీ సభ్యులు విద్యాశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వరదబాధితులకు ఆహారం, నీరు

### - నిరంతరంగా శ్రమిస్తున్న ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు

### - సహాయక చర్యలపై చంద్రబాబు పర్యవేక్షణ

విజయవాడ, తెలంగాణ ముచ్చట్లు : విజయవాడను పెద్ద ఎత్తున వరద ముంచెత్తడంతో.. ఏకంగా సీఎం చంద్రబాబు సహా మంత్రులు, అధికారులు అంతా విజయవాడలోనే తిష్ట వేసి మరీ వరద సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. బాధితులకు ఎప్పటికప్పుడు ధైర్యం చెబుతున్నారు. బాధితులకు మూడు పూటలా భోజనంతో పాటు వాటర్ సదుపాయం కల్పిస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దింపి మరీ సహాయక చర్యలు బాధితులకు అందేలా చూస్తున్నారు. విపత్తు సమయంలో సరిగా పని చేయకుంటే ఎవ్వరినీ వదలబోనని సీఎం చంద్రబాబు తెలిపారు. మరోవైపు మంత్రి నారా లోకేష్ పర్యవేక్షణలో విజయవాడ వరద బాధితులకు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మంగళవారం సహాయక చర్యల్లో ఆరు హెలికాప్టర్ల ద్వారా ఆహారం, తాగు నీటిని సరఫరా చేశారు. బోట్లు చేరుకోలేని ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా ఆహార సరఫరా చేస్తున్నారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ విజ్ఞప్తి మేరకు జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీకి ప్రత్యేక హెలికాప్టర్‌లో 2,500 ఆహార పొట్లాలను చేరవేస్తున్నారు. విజయవాడ పరిధిలో వరద ముంపునకు గురైన 32 వార్డుల్లో సీనియర్ ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మంత్రి లోకేష్ పిలుపు మేరకు సహాయ చర్యల్లో రాష్ట్రం నలుమూలల నుంచి విజయవాడకు పార్టీ శ్రేణులు చేరుకున్నాయి. విజయవాడ డివిజన్ పరిధిలో 70 పునరావాస కేంద్రాల్లో 14,452 మంది నిరాశ్రయులు ఆశ్రయం పొందుతున్నారు. ప్రకాశం బ్యారేజి వద్ద వేగంగా వరద తగ్గుముఖం పడుతోంది. ప్రస్తుత వరద ప్రవాహం 8,71,776 క్యూసెక్కులకు చేరుకుంది. మరోవైపు రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్లో అధికారులతో సమీక్ష నిర్వహించారు.

# వరద పరిస్థితులపై అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ నాగలక్ష్మీ

గుంటూరు, తెలంగాణ ముచ్చట్లు : జిల్లాలో వరద పరిస్థితులు , తీసుకుంటున్న సహాయక చర్యలపై మున్సిపల్ కమిషనర్లు , ఆర్ డి ఓ , యంపీడీఓ లు, తహసీల్దార్లు , మెడికల్ , జిల్లా పరిషత్ , పంచాయితీ రాజ్ , ఆర్ అండ్ బి , పశు సంవర్ధక శాఖ , చేనేత జౌళి శాఖ, సివిల్ సప్లయిస్ అధికారులతో జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ మంగళవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. గత నెల 30 , 31 తేదీలలో కురిసిన వర్షాల కారణంగా కృష్ణా నదికి 11.4 లక్షల క్యూసెక్కుల నీరు డిశ్చార్జ్ అయిందన్నారు. అయితే ఈ రోజు ఉదయం 8.6 లక్షల క్యూసెక్కులకు తగ్గిందని తెలుపుతూ ఈ నెల 3, 4 , 5 వ తేదీలలో మోడరేట్ గా 65 మిల్లీ మీటర్ల వర్షాలు పడే అవకాశం వున్నందున సంబంధిత అధికారులు అప్రమత్తంగా వుండాలన్నారు. కర్నాటక , తెలంగాణా రాష్ట్రాలలో పడే వర్షం కృష్ణా నదికి రావచ్చని తెలిపారు. అందువల్ల వరద ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులందరు అప్రమత్తంగా వుండాలన్నారు. నీట మునిగిన ప్రాంతాల కాలనీలలో నీరు తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకొని ప్రజలకు సౌకర్యాన్ని కల్పించాలన్నారు. అలాగే నీటి ప్రవాహ ప్రాంతాల వద్ద ప్రజలు వచ్చి చూడడానికి ఉత్సుకత చూపిస్తారని , అలాగే ఫోటో సెల్ఫీ లు తీసుకోవడానికి ప్రయత్నించవచ్చని , అందువల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు వున్నందున అధికారులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటికే వరద వల్ల ఏడుగురు చనిపోయారని , ఇక ఎలాంటి ప్రాణ నష్టం జరగడానికి వీలు లేదన్నారు. తహసీల్దార్లు , మునిసిపల్ కమిషనర్లు సచివాలయ సిబ్బందికి , చిరుద్యోగులకు డ్యూటీ లు వేసి జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వరద వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో ఎన్యుమరేషన్ పూర్తి చేయాలన్నారు. వరదలకు ప్రభావితమైన కుటుంబాలకు నిత్యావసర సరుకుల కిట్లను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 25 కిలోల బియ్యం , ఒక కే.జి కందిపప్పు , ఒక కే.జి చక్కెర , కే.జి పామాలిన్ ఆయిల్ , కే.జి బంగాళాదుంప , కే.జి ఉల్లిపాయాలను ఒక కిట్ గా చేసి కుటుంబానికి పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్యూమరేషన్ పూర్తి చేసి ఈ రోజు సాయంత్రం నుండి కిట్లను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మత్స్యకారులు , వీవర్స్ కుటుంబాలకు 50 కే.జీ ల బియ్యం అందించాల్సి వుందన్నారు. ఈ వరదల వల్ల జరిగిన పశు మరణాలను ఎన్యుమరేట్ చేయాలన్నారు. అలాగే వరద ప్రభావిత ప్రాంతాలలోని పశువులకు పశుగ్రాసం సరఫరాకు పశు సంవర్ధక శాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. వరద నీరు తగ్గుముఖం పడుతున్నందున ఆ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులతో పాటు కాలువల పూడికతీత పనులు చేపట్టాలని జిల్లా పంచాయితీ అధికారిని ఆదేశించారు. జిల్లాలో చనిపోయిన ఏడుగురికి ఒక్కొక్కరికి ఐదు లక్షల రూపాయల ప్రకారం ఎక్స్ గ్రెసియా అందించాల్సి వుందన్నారు. వర్షాలు , వరదల వల్ల దెబ్బతిన్న ఆటోలు , తోపుడు బండ్లను ఎన్యుమరేట్ చేయాలన్నారు. అలాగే హ్యాండ్ లూమ్ మగ్గాలు , మెటీరియల్ , తయారైన వస్త్రాలు వరదల వల్ల నష్టం కలిగి వుంటే వాటిని కూడా ఎన్యుమరేట్ చేయాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో మెడికల్ క్యాంప్ లు ఏర్పాటు చేసి అక్కడి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని డి యం అండ్ హెచ్ ఓ ను ఆదేశించారు. వరద వల్ల దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తులు చేపట్టేందుకు ఆర్ అండ్ బి మరియు పంచాయితీ రాజ్ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వరద వల్ల జరిగిన విద్యుత్ అంతరాయాన్ని సరిచేసి విద్యుచ్ఛక్తి సరఫరా పునరుద్ధరించాలన్నారు. నీటి పారుదల శాఖ అధికారులు కాలువ కట్టలు రెస్టోరేషన్ కు చర్యలు తీసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాలలోని 8200 కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీకి కిట్లను సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. వాటిని ఎం ఎల్ ఎస్ పాయింట్ల వద్ద సిద్దంగా వుంచి పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి కిట్లు అందించాలని , అలాగే అనర్హులైన ఏ ఒక్కరికి కిట్లు అందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# చైనా జాతీయుడుకి సహకరించిన కానిస్టేబుల్ - 2035 కే.బాలాజీ సస్పెండ్

### - ఒక కానిస్టేబుల్, ఇద్దరు హోమ్ గార్డులపై సస్పెన్షన్ వేటు - అవినీతి, అక్రమ పోలీసుల భరతం పడుతున్న జిల్లా ఎస్పీ






తిరుపతి, తెలంగాణ ముచ్చట్లు : రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధి గురవరాజు పల్లి గ్రామంలో వీసా గడువు పూర్తయిన కూడా అక్రమంగా భారతదేశంలో నివాసం ఉంటూ నకిలీ ఆధార్ కార్డు, పాన్ కార్డులను కలిగి ఉన్న చైనా జాతీయుడు పై 2021 వ సంవత్సరంలో రేణిగుంట అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి, జైలుకు పంపారు. గాజుల మండ్యం పోలీస్ స్టేషన్లో పోలీస్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న -2035, కే. బాలాజీ ఈ కేసు విషయంలో చైనా జాతీయుడికి సహాయం చేస్తానని నమ్మబలికి, కేసుకు సంబంధించిన పోలీసు వివరాలను నిత్యం తెలియజేస్తూ, అతని నుండి 2 లక్షల రూపాయలను తీసుకున్నదిగా రుజువు కావడంతో వెంటనే క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సదరు కానిస్టేబుల్ పిసి-2035 కే బాలాజీ ను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులు ఇచ్చారు. 2. తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న 03, టి. గిరి అనే హోంగార్డు స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక, కంకర, ఇతర వస్తువులను రవాణా చేస్తున్న ట్రాక్టర్ల డ్రైవర్ల నుండి లంచం అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని తమ విచారణలో నిరూపణ అవడంతో జిల్లా ఎస్పీ క్రమశిక్షణ చర్యలలో భాగంగా సదరు హోంగార్డును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. 3. అలిపిరి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న %ఎ+%-348, కే. రాజ్ కుమార్ అనే హోంగార్డు ఇతరుల మొబైల్ ఫోన్ నుండి తనపై అధికారులకు అనధికారికంగా ఫోన్ కాల్ చేసి తన సహోదయోగులపై లేనిపోని ఆరోపణలు చేశారని తమ విచారణలో రుజువు అవడంతో జిల్లా ఎస్పీ గారు క్రమశిక్షణ చర్యలలో భాగంగా సదరు హోంగార్డును విధుల నుండి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. సస్పెండ్ అయిన సిబ్బందిపై సమగ్ర విచారణ జరిపి, తదుపరి శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నారు. పోలీస్ శాఖ లో ఎవరైనా సరే క్రమశిక్షణ మరియు వృత్తి నైపుణ్యం యొక్క అత్యున్నత ప్రమాణాలను నిర్వహించక పోతే ఉపేక్షించేది లేదని.. నలుగురిలో తప్పు చేసిన, నాలుగు గోడల మధ్య తప్పు చేసిన ఎవరు గమనించరని భ్రమ పడకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి. పోలీస్ శాఖ అంటే నిర్దిష్టమైన యూనిఫామ్ కలిగిన సేవ.. ఎప్పుడూ ప్రజలకు జవాబుదారితనంగా ఉండాలి. ఎవరైనా పోలీస్ శాఖ ప్రతిష్టకు భంగం కలిగిస్తే ఉపేక్షించబోమని ఎంతటి వారిపైనైనా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఐపిఎస్., ఘాటుగా జిల్లా పోలీసులను హెచ్చరించారు.

# సినిమా న్యూస్



# గర్భిణి దీపిక ఫోటోషూట్.. కల్కి ఆవిర్భావానికి డేట్ ఫిక్స్




ఇటీవలే కల్కి 2989 ఏడి చిత్రంలో నటించింది దీపిక పదుకొనే. కెరీర్ లో తొలి బిగ్గెస్ట్ పాన్ ఇండియా హిట్ అందుకుంది. కల్కి ప్రమోషన్స్ లో బేబి బంప్ తో కనిపించింది. ఇంత లోనే ఇప్పుడు బిడ్డను కనేందుకు కూడా సిద్ధమైంది. అయితే దీపిక బేబి బంప్ నిజమా కాదా? అంటూ నెటిజనులు కొందరు సందేహించిన క్షణం.. నెలల తరబడి కొందరి వెటకారం అవమానాలు చవి చూసింది ఈ మేటి నటి. కొందరు బేబీ బంప్ నిజమే అన్నారు. మరికొందరు దాని ఆకారం మారుతూనే ఉందని వ్యంగ్యంగా మాట్లాడారు. ఛాటు మోటు వ్యాఖ్యలు సోషల్ మీడియాల్లో ఎన్నో. ఇవన్నీ రకరకాల పుకార్లకు ఆజ్యం పోశాయి. అయితే దీపిక అన్నిటికీ ఇలా సమాధానమిచ్చింది. తన భర్త రణవీర్ సింగ్‌తో కలసి తన బేబీ బంప్ ఫోటోషూట్ ని షేర్ చేయడం ద్వారా అన్నిటికీ చెక్ పెట్టింది. నిండు గర్భిణి అయిన దీపికా పదుకొణె ప్రసూతి ఫోటోషూట్ తన జీవితంలో ఒక ప్రత్యేక అధ్యాయం. ఇది అద్భుతమైన వేడుక. ఒక చక్కని ఫోటోలో దీపిక నలుపు రంగు సూట్ – లేస్ బ్రాలెట్ కాంబోను ధరించి కనిపించింది. తన బేబి బంప్ ని ఈ ఫోటోషూట్ విస్తారంగా ప్రదర్శించింది. తనదైన మార్క్ చిరునవ్వుతో దీపిక వెలుగులు నింపింది. ఇక బేబి బంప్ ని ఆవిష్కరించే అందమైన నల్లటి పారదర్శక దుస్తులలో దీపిక ఫోజులు ఇప్పుడు వైరల్ గా మారుతున్నాయి. ఈ స్పెషల్ ఫోటోషూట్ బేబి బంప్‌ని అందంగా చూపించింది. చాలా ఊహాగానాల తర్వాత దీపికా – రణవీర్ సింగ్ ఈ ఏడాది ఫిబ్రవరిలో తొలి బిడ్డ గురించి ప్రకటించారు. తమ బిడ్డ సెప్టెంబర్ 2024లో జన్మిస్తుందని తెలిపారు. ఈ పోస్ట్‌కు ఆలియా భట్, ప్రియాంక చోప్రా జోనాస్, విక్రాంత్ మాస్సే, ఆయుష్మాన్ ఖురానా, సోనమ్ కపూర్ అహూజా వంటి సహచరుల నుండి చాలా ప్రేమ లభించింది.

# నడుము లోతులో జాకీ జివ్వుమనిపించేలా!



శ్రీలంక హాట్ బ్యూటీ జాక్వెలిన్ పెర్నాండేజ్ వైరల్ సెన్సేషన్స్ గురించి చెప్పాల్సిన పనిలేదు. జాకీ ఎప్పుడు ఇన్ స్టాకి ఎక్కినా కుర్రాళ్ల మతులు చెడాల్సిందే. అందంతో అగ్గి రాజేయాల్సిందే. డిజైనర్ దుస్తుల్లో సొగసరి మెరుపుల సంచలనాలు కొనసాగాల్సిందే. ఆన్ ది స్క్రీన్ అయినా..ఆఫ్ ది స్క్రీన్ అయినా జాకీ హాట్ దెబ్బకి యువత విలవిలలాడిల్సిందే. జాకీ మైకంలో పడిన తర్వాత తప్పక ఈదాల్సిందే. ఆ స్థాయిలో ఫేమస్ అయింది కాబట్టే జాకీ పేరెత్తితే ఓ వైబ్ క్రియేట్ అవుతుంది. కేవలం వారసత్వ పరిశ్రమలో తనను తాను నిలబెట్టుకునేందుకే జాకీ ఇలాంటి సాహసాలకు ఎప్పటికప్పుడు పూనుకుంటుంది. ఫ్యాన్స్ లో తనకు ఏమాత్రం క్రేజు తగ్గకుండా జాగ్రత్త పడుతుంది. తాజాగా అమ్మడు మరో హాట్ ఫోటోతో నెట్టింట్లోకి వచ్చేసింది. ఇదిగో ఇక్కడిలా నడుం లోతు నీటిలో అందాల జాకీని హైలైట్ చేసింది. వైట్ కలర్ లో దుస్తుల్లో జాకీ స్కిన్ షో ఆద్యంతం హైలైట్ అవుతుంది. రెండు కళ్లు మూసుకుని తడిచిన కురులను అలా పైకి లేపుతూ పేంపర్ చేస్తోంది. ఈ ఫోటోని ఉద్దేశించి ఓ క్యాప్షన్ వైరల్ అవుతుంది. నీటిలో ఓ మత్స్యకన్యలా తేలుతుంది. అలల మధ్య మెరుస్తున్న ఆమె అందం అద్భుతం అంటూ కొన్ని రకాల రొమాంటిక్ ఎమోజీలను పోస్ట్ చేసారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. జాకీ అభిమనులు తమదైన శైలిలో కామెంట్ల గుప్పిస్తున్నారు. ఇక అమ్మడి కెరీర్ సంగతి తెలిసిందే. మనీలాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కున్న కొత్త లో కెరీర్ పై కొంత ప్రభావం పడింది. కొన్ని ప్రాజెక్ట్ లనుంచి వైదలగాల్సి వచ్చింది. కానీ ఈడీ అధికారులకు వివరణ ఇచ్చుకున్న తర్వాత నెగివిటీ తగ్గింది. మళ్లీ కెరీర్ ఇప్పుడు పట్టాలెక్కుతోంది.

# ‘ది గోట్’ రొమాంటిక్ సెల్ఫీ అదుర్స్



తమిళ్ సూపర్ స్టార్ విజయ్ రాజకీయ రంగ ప్రవేశం కన్ఫర్మ్ అయింది. ఇటీవలే ఆయన తన పార్టీ జెండాను కూడా ఆవిష్కరించి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించబోతున్నట్లు అభిమానులతో చెప్పకనే చెప్పాడు. విజయ్ రాజకీయం పై తమిళనాడు తో పాటు మొత్తం దేశం మొత్తం ఆసక్తి నెలకొంది. త్వరలో పూర్తి స్థాయిలో రాజకీయ నాయకుడిగా మారబోతున్న విజయ్ నటించిన తాజా చిత్రం ది గోట్. సాధారణంగా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వాలని భావించినప్పుడు పొలిటికల్ డ్రామా సినిమాలను చేసేందుకు ఆసక్తి చూపిస్తూ ఉంటారు. కానీ ది గోట్ లో పొలిటికల్ యాంగిల్ ఉన్నట్లుగా అనిపించడం లేదు. విజయ్ చివరి సినిమాగా ది గోట్ ను కొందరు ఫ్యాన్స్ తో పాటు తమిళ్ మీడియా వర్గాల వారు ప్రచారం చేస్తున్నారు. దాంతో ది గోట్ పై తమిళ్ ఆడియన్స్ లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. సాధారణంగానే విజయ్ సినిమా అంటే తమిళనాట ఓ రేంజ్ వసూళ్లు నమోదు అవుతాయి. విజయ్ చివరి సినిమా అనే ప్రచారం జరిగిన నేపథ్యంలో అంతకు మించి వసూళ్లు నమోదు అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ వారంలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ది గోట్ సినిమా కు తెలుగు రాష్ట్రాల్లో మాత్రం పెద్దగా బజ్ క్రియేట్ అవ్వలేదు. అసలు ప్రచారం లేకుండానే రిలీజ్ కి రెడీ చేస్తున్నారు. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్ ప్రారంభం అయ్యింది. తమిళ్ తో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా ది గోట్ కి రెస్పాన్స్ బాగానే ఉందని మేకర్స్ అంటున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి విజయ్ ఇంకా హీరోయిన్ మీనాక్షి చౌదరి ఫోటోను షేర్ చేశారు. విజయ్ ను రెండువిభిన్నమైన పాత్రల్లో,తండ్రి కొడుకులుగా చూడబోతున్నాం. కొడుకు పాత్రను మరీ వయసు తక్కువగా చూపించారు. అందుకోసం ఉపయోగించిన టెక్నాలజీ బాగుందంటూ నెటిజన్లు ఈ ఫోటోను చూసి కామెంట్స్ చేస్తున్నారు. విజయ్ హెయిర్ స్టైల్ తో పాటు, ఔట్ ఫిట్ భలే ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. గుంటూరు కారం సినిమా తర్వాత మీనాక్షి చౌదరి కి దక్కిన మరో భారీ చిత్రం ది గోట్, అది కాకుండా తమిళ్ సూపర్ స్టార్ తో నటించిన సినిమా అవ్వడంతో అందరి దృష్టి ఈ అమ్మడి కెరీర్ పై పడింది. చిన్న సినిమాల హీరోయిన్ గా కెరీర్ ఆరంభంలో సినిమాలు చేసిన ఈ అమ్మడు గుంటూరు కారం సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా నటించి, ది గోట్ లో మెయిన్ హీరోయిన్ గా నటించింది. ది గోట్ లో మీనాక్షి తో పాటు మాళవిక శర్మ కూడా నటించింది. కానీ అందరి దృష్టి కూడా మీనాక్షి చౌదరి పై నే ఉంది. విజయ్ తో రొమాంటిక్ సెల్ఫీ తీసుకుంటూ కనిపిస్తున్న మీనాక్షి చౌదరి అప్‌కమింగ్ స్టార్ హీరోయిన్ అంటూ అందరితో అనిపించుకుంటోంది. తమిళ్ లో ఈ సినిమా తర్వాత మీనాక్షి ఫుల్ బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

# పిల్లలు చూడలేని సినిమాలో నాని




నేచురల్ స్టార్ నాని సినిమాలు అంటే అన్ని వర్గాల ప్రేక్షకులు చూడగలిగే విధంగా ఉంటాయనే అభిప్రాయం ఉంది. అలాగే చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ కుటుంబంతో కలిసి వెళ్లి సినిమా చూడొచ్చు. తాజాగా సరిపోదా శనివారం సినిమాతో నాని ప్రేక్షకుల ముందుకొచ్చాడు. ఈ సినిమాలు యాక్షన్ అంశాలు ఎక్కువగానే ఉన్నా కూడా ఫ్యామిలీ అందరూ చూడగలిగే చిత్రంగానే ఉంది. పిల్లలు కూడా నాని సినిమాలని ఇష్టపడుతూ ఉంటారు. చాలా మంది పిల్లలు నానికి ఫ్యాన్స్ గా ఉంటారు. వారికి నచ్చే అంశాలు నాని చేసే సినిమాలలో చాలా ఉంటాయి. నాని కెరియర్ లో వైలెన్స్ ఎక్కువ ఉండి, అస్సలు పిల్లలు చూడలేని విధంగా ఉన్న సినిమాలు అంటే పెద్దగా లేవని చెప్పొచ్చు. ఒక్క దసరా మాత్రమే రెండు చోట్ల యాక్షన్ సీక్వెన్స్ కాస్త వైలెంట్ గా ఉంటాయి. ఇదిలా ఉంటే సరిపోదా శనివారం సినిమా సక్సెస్ మీట్ లో నాని నెక్స్ట్ చేయబోయే సినిమా గురించి ఇంటరెస్టింగ్ కామెంట్స్ చేశారు. నేను చేయబోయే నెక్స్ట్ సినిమాని పిల్లలకి అస్సలు చూపించకండి. ఎందుకంటే అందులో వైలెన్స్ ఎక్కువగా ఉంటుంది. తలలు నరికే సన్నివేశాలు ఉంటాయి. అందుకే ముందే సూచిస్తున్నట్లు తెలిపారు. సరిపోదా శనివారం సినిమాలో కాస్త హింసాత్మక సన్నివేశాలు ఉన్న కూడా అందరూ చూడగలిగే విధంగానే ఉంటాయి. అయితే నెక్స్ట్ రాబోయే సినిమాలో సీక్వెన్స్ మాత్రం పిల్లలు చూడలేరని చెప్పిన నాని ముందే రెడ్ అలెర్ట్ ఇచ్చారు.

**Publisher, Printer, Owner Bollepaka Rajesh,** H.No. 2-19/1, (v) Thatikayala, (m) Dharmasagar, Hanmakonda (Dist) Telangana State. Printed at Amulya publications & printers and graphics. Place of Publication H.No. 2-19/1, (v) Thatikayala, (m) Dharmasagar, Hanmakonda (Dist) Telangana State, Pin code : 506151. **Editor : Bollepaka Rajesh. 9493669669**
**TELTEL12273** Website : www.telanganamuchatlu.in “Mail I’d: telanganamuchatlu.in@gmail.com